ఆదివారం

ప్రజాశక్తి

28 అక్టోబర్, 2001



సుస్వరానికి సుమహారం

ఉత్తరాంధ్రలో ISI ముద్ర కలిగిన ఏకైక సంస్థ

గృహావసరమైనా, పరిశ్రమ అయినా బోర్‌వెల్
అయినా నాణ్యతకు మా
శ్రీ వాసవి పి.వి.సి. పైపులనే వాడండి

శ్రీ వాసవి పైపులు

Rigid P.V.C. H.D.P.E., S.W.R.,
Blue Theraded, Durawin Pipes and Couplers



తయారు చేయువారు:

శ్రీ వాసవి పాలిమర్స్ ప్రై. లిమిటెడ్

అంతకాపల్లి, పొందూరు రోడ్, రాజాం-532 127, శ్రీకాకుళం జిల్లా. ఫోన్: 08941-51132, 51383. ఫ్యాక్స్: 51382.

విశాఖపట్నం : ఫోన్: 790389, 790366, 790884, విజయవాడ: 562056, 620576, నెల్లూరు : 334315, 316746 హైదరాబాద్: 4122220

ఉత్తరాంధ్రలో ISI ముద్ర కలిగిన పి.వి.సి. పైపులు తయారు చేయు ఏకైక సంస్థ

20 mm-200 mm, 4kgf/6kgfcm^2 లలో లభ్యమగును

కేసింగ్ పైపులు మా ప్రత్యేకత

లోపలి పేజీల్లో.....

పాత్రోచిత
భాష... 8

పిల్లలకు నచ్చే
ఆహారం
పెడుతున్నారా
...10



మనోహర శిల్పాల 'మహేశ్వరం'... 16

దశ తిరిగింది..... 18, 19

ఇంకా...

ఆరోగ్యం 6, 7

బాల కథ 11

బాల నేస్తాలు 12, 13

కచేరి 14

క్రీడారంగం 17

అదాలత్ కథలు 22, 23

పలుకుబడి 24

వగైరా........

వృత్తి - ప్రవృత్తి

మంచు కొండలను ఎక్కి నూతన రికార్డులను సృష్టించాలనుకునే వారు అనేక సాహస చర్యలను చేపట్టాలి. భౌతిక మానసిక ఒత్తిడులకు లోను కావాలి. వారి ఆశ విశ్వాసాలు వారి భీతిని అదుపు చేసి సవాలును అనుభూతిగా అందజేస్తాయి. అంగవైకల్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఎంతోమంది ఘన విజయాలను సాధించి చరిత్రను సృష్టించారు. శ్రమశక్తి ఎంత ఎక్కువ చెయ్యగలిగితే అంత ప్రయోజనం ఉంటుంది. శ్రమ శక్తిని ఓర్పుతో నేర్పుగా చెయ్యడానికి వృత్తి - ప్రవృత్తి పరస్పర పూరకాలుగా వుండాలి. వృత్తి భౌతికమయినదయితే, ప్రవృత్తి మానసికమైనది. ప్రవృత్తికి తగిన వృత్తి లభించటం కష్టం. సామాన్యంగా అందుబాటులో వున్న వృత్తిని చేపట్టి జీవన ప్రక్రియను కొనసాగిస్తాం. అట్టి సందర్భాలలో వృత్తికి ప్రవృత్తికి ఘర్షణ ఏర్పడుతుంది. ప్రవృత్తి అదుపు తప్పి వ్యవహరిస్తే మానసిక ఒత్తిడి కల్గుతుంది. పర్యవసానంగా వృత్తి నుండి అసంతృప్తి కలుగుతుంది. అంతర్గత శక్తిలో ఎక్కువ భాగం వ్యతిరేక భావావేశంగా వృధా అయిపోతుంది. పర్యవసానంగా మానసిక, శారీరక రుగ్మతలతో బాధపడవలసి వస్తుంది. వృత్తిని ప్రవృత్తిని సమన్వయం చేసు కోవడానికి మనస్సు తోడ్పడుతుంది. మన న్సంటే మార్గ ముంది.

మనలో మాట

వృత్తిని సక్రమంగా నిర్వహించటానికి మానసిక శారీరక శక్తులు సమన్వయంతో వ్యవహరించాలి. ఈ సమన్వయాన్ని ఎవరికి వారే సాధించాలి. ప్రవృత్తికి అనువైన వృత్తి లభిస్తూ ఎంత పని చేసినా అలసిపోము. వృత్తిని ఎంపిక చేసుకోవడానికి అనేక పరిమితులు వున్నాయి. అందువల్ల అందుబాటులో వున్న వృత్తి పట్ల సానుకూలంగా స్పందించే ప్రవృత్తిని కష్టపడి అలవర్చుకోవాలి. ఇట్టి కృషి చెయ్యలేనివారు తరచు మానసిక ఒత్తిడికి లోనయి బాధపడ్తూ కనిపిస్తారు. అట్టి వారికి పై అధికారుల అజమాయిషి, క్రింది ఉద్యోగుల క్రమరాహిత్యత, సహోద్యోగుల ఎత్తి పొడుపులు, వినిమయదారుల నిర్హేతుక ప్రవర్తన భరించరాని మానసిక ఒత్తిడిని కలుగజేస్తాయి. ఏ వృత్తిలోనయినా భిన్న దిశల నుండి ప్రేరణలు తప్పవు. అధికారులు అజమాయిషి చేయడానికి నియమించబడ్తారు. వారు తరచు పర్యవేక్షణలు జరిపి లోటుపాట్లను ఎత్తి చూపుతారు. అట్లాగే క్రింది ఉద్యోగులు అనేక తప్పులు చేస్తారు. వారిని సరిదిద్దాల్సిన బాధ్యత వృత్తి నిర్వహణలో ఉంటుంది. సహఉద్యోగులు ఎదురు చూసిన సహకారాన్ని ఇవ్వరు. మన సేవలను అందుకొన్న వినియోగదార్లు అనేక నిర్హేతుక కోరికలతో విసిగిస్తారు. ఇట్టి అసౌకర్యాలు లేని వృత్తులు ఉండవు. వృత్తిలో ఎదురయ్యే ప్రతి ప్రేరణను ఇతరులు కలుగజేస్తున్నారనే అపోహతో ఉంటే, మానసిక ఒత్తిడి అదుపు తప్పుతుంది. బాహ్యప్రేరణలు వృత్తితో పాటు వస్తాయి. ☆

లాఠీచార్జ్.. చేయడం.. మా ప్రభుత్వ నినాదమని తెలియదా?
GANGA DHAR


అమ్మాయి సౌందర్యవతేనయ్యా.. కాకపోతే... ఈ మధ్య ఆంత్రాక్స్ భయంతో టాల్కం పౌడర్ రాసుకోవడం మానేసిందంతే!!
GANGA DHAR


హాయ్.. లాడెన్.. ఎంత ధైర్యం నా పుట్టలోకి ప్రవేశిస్తావా? ఇక్కడ నేనే రాజుని తెలియదా? మర్యాదగా ఇక్కడినుండి పారిపో!!
ప్రపంచ ఉగ్రవాదం
GANGA DHAR

ఆమె పాట...

పిల్లతెమ్మెరలా పలకరిస్తుంది. అంతలోనే ప్రళయమారుతమై విజృంభిస్తుంది. గలగలా పారే సెలయేరును తలపిస్తుంది. వరదగోదారై భయకంపితం చేస్తుంది. తటాలున మెరిసే మెరుపును గుర్తుచేస్తుంది. మరుక్షణంలోనే భీకరగర్జనల ఉరుమౌతుంది. వడివడిగా నడుస్తూ మనలనూ తనతో నడిపిస్తుంది. చిలిపితనం కురిపిస్తుంది. ఆనందం వెల్లివిరిసేలా చేస్తుంది. హస్కీ గొంతుతో కిర్రెక్కిస్తుంది. ఇలా ఎంత చెప్పినా తక్కువేననిపిస్తుంది. ఇంతకీ ఎవరామె?...

ఆమే ఆశాభోంస్లే...

ఆశాకు ఫాల్కే పురస్కారం

సుస్వరానికి సుమహారం

పోతుకూరు శ్రీనివాసరావు

భారత చలనచిత్ర సంగీత ప్రపంచాన్ని ఐదున్నర దశాబ్దాలుగా ఉర్రూతలూగిస్తున్న సంగీత విద్వన్మణి ఆశాభోంస్లేకు అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది. చలనచిత్ర పరిశ్రమతోబాటు సంగీతాభిమానులందరినీ ఈ వార్త ఎంతో ఆనంద పరిచింది. బాలీవుడ్‌లోనే కాదు 'మక్కా ఆఫ్ మ్యూజీషియన్స్'గా అంతా భావించే న్యూయార్క్‌లో సైతం ఆమె పేరు మారుమోగుతుంటుంది. విదేశాల్లో సైతం లెక్కకు మిక్కుటంగా అభిమానులను సంపాదించుకున్న ఆశాకు ఆలస్యంగానైనా లభించిన ఫాల్కే అవార్డు ఆమె కీర్తి కిరీటంలో మరో కలికితురాయిలా భాసిస్తుందనడం అతిశయోక్తి కాదు. పశ్చిమదేశాల ప్రముఖ పాప్ సింగర్లు బోయ్‌జార్జి, స్టీఫెన్ లస్కాంబే, కోడ్ రెడ్‌లతో కలసి ఆల్బమ్‌ల్లో భాగం పంచుకున్న ఘనత ఒక్క ఆశాభోంస్లేకే దక్కుతుంది. ఆశా ఫాల్కే అవార్డును అందుకోబోతున్న ఈ నేపథ్యంలో ఆమె సృష్టించిన స్వర తరంగాల గురించి, వ్యక్తిగత జీవిత విశేషాల గురించి రేఖామాత్రంగా స్పృశించడమే ఈ కవర్‌పేజీ కథనం ఉద్దేశం...

వ్యక్తిగతం

ప్రముఖనటుడు, గాయకుడు దీనానాథ్ మంగేష్కర్‌కు ఆశా 1935 సెప్టెంబర్ 8న జన్మించారు. దీనానాథ్ అప్పట్లో ఒక డ్రామా ట్రూపును నిర్వహిస్తుండే వారు. ఆ విధంగా ఆశాకు చిన్నతనం నుండీ సంగీతంతో పరిచయం ఏర్పడింది. దానిపైనే మక్కువ పెంచుకుంది. అయితే ఆశా బాల్యమంతా కష్టాల మయంగానే గడిచింది. తొమ్మిదేళ్ల వయసులో 1942లో తండ్రి దీనానాథ్ కన్నుమూశారు. నిస్సహాయంగా మారిన దీనానాథ్ కుటుంబం పూనే నుండి కొల్హాపూర్‌కు మారింది. అప్పటికే పాటలు పాడుతూ కొద్దో గొప్పో సంపాదిస్తున్న 13 ఏళ్ల పెద్దక్క లతా మంగేష్కరే ఆశా, ఆమె సోదరుడు హృదయనాథ్, ఇద్దరు చెల్లెళ్లు మీనా, ఉష అందరికీ ఆధారం. 1945లో లతామంగేష్కర్‌కు అవకాశాలు పెరిగి కుటుంబం మకాం బొంబాయికి మారింది. అక్కడ ఆశాకు గణపతిరాం భోంస్లేతో పరిచయం కలిగి అది వివాహానికి దారితీసింది. అప్పటికి ఆశా వయసు 14 ఏళ్లే. ఇంట్లో నుండి పారిపోయి వివాహం చేసుకున్న ఆశా జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించింది. పాడే అవకాశాల కోసం ఎంతగానో కష్టపడాల్సి వచ్చింది. ఇంట్లో ఇష్టం లేకున్నా పెళ్లి చేసుకున్నందున లత నుండి సహాయమూ ఆగిపోయింది. అయినా ధైర్యం కోల్పోకుండా గాయనిగా నిలబడడానికి ఆమె అహరహం కృషిచేశారు. ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భోంస్లేతో విభేదాలు వచ్చి ఇద్దరూ విడిపోయారు. ఆరు దశాబ్దాలు దాటినా తాను ఉత్సాహంగా పాటలు పాడడానికి తన పిల్లల ప్రోత్సాహమే కారణమని ఆశా అంటుంటారు. ఆర్.డి.బర్మన్ ను రెండవ వివాహం చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తడాన్ని ఆమె అస్సలు పట్టించుకోరు.

ఫాల్కే విజేతలు

దాదాసాహెబ్ ఫాల్కే

భారతీయ చలన చిత్ర పిత దాదాసాహెబ్ ఫాల్కే పేరు మీదుగా ప్రారంభించిన ఫాల్కే అవార్డును 1969 నుండీ ఇస్తున్నారు. భారతీయ చలన చిత్ర రంగానికి విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఈ అవార్డును ఏటా అందజేస్తున్నారు. ప్రారంభ సంవత్సరం దేవికారాణి ఈ అవార్డును అందుకున్నారు. ఆ తర్వాత 1974లో బి.ఎన్.రెడ్డి, 1982లో ఎల్.వి.ప్రసాద్, 1986లో బి.నాగిరెడ్డి, 1990లో అక్కినేని నాగేశ్వరరావు ఈ అవార్డును అందుకున్న తెలుగువారు.

దేవికారాణి

1969	దేవికారాణి
1970	బి.ఎన్.సర్కార్
1971	పృధ్విరాజ్ కపూర్
1972	పంకజ్ మల్లిక్
1973	సులోచన
1974	బి.ఎన్.రెడ్డి
1975	ధీరేన్ గంగూలీ
1976	కానన్ దేవి
1977	నితిన్‌బోస్
1978	ఆర్.సి.బోరాల్
1979	సోహ్రబ్‌మోడి
1980	పి.జైరాజ్
1981	నౌషాద్ అలీ
1982	ఎల్.వి.ప్రసాద్
1983	దుర్గా కోటే
1984	సత్యజిత్‌రే
1985	పి.శాంతారాం
1986	బి.నాగిరెడ్డి
1987	డా॥ రాజ్‌కపూర్
1988	అశోక్‌కుమార్
1989	లతామంగేష్కర్
1990	అక్కినేని నాగేశ్వరరావు
1991	బాలాజీ పెంధార్కర్
1992	భూపేన్ హజారికా
1993	మజ్రూహ్ సుల్తాన్‌పురి
1994	దిలీప్ కుమార్
1995	డా॥ రాజ్‌కుమార్
1996	శివాజీ గణేశన్
1997	ప్రదీప్
1998	బి.ఆర్.చోప్రా
1999	హృషీకేష్ ముఖర్జీ
2000	ఆశాభోంస్లే

బి.ఎన్.రెడ్డి



ఎల్.వి.ప్రసాద్

నాగిరెడ్డి

అక్కినేని

'వ్యక్తిగత అవసరాల కన్నా సంగీతపరమైన అవసరాలే మమ్మల్ని దగ్గర చేశాయి' అని ఆమె స్పష్టంగా చెబుతారు. ఇపుడు మనుమలు, మనుమరాండ్రతో తన జీవితం హ్యాపీగా గడిచిపోతున్నదని ఆశా అంటుంటారు. పెద్ద కుమారుడు హేమంత్. కాగా ఆశా వ్యవహారాలు, డేట్స్ అన్నీ ఆమె చిన్న కుమారుడు ఆనంద్ చూస్తుంటాడు. కుమార్తె వర్ష జర్నలిస్టుగా స్థిరపడింది.

ఆకాశమే హద్దు

మొట్టమొదటగా *1943లో* చునరియా అనే చిత్రానికి గాను హన్సరాజ్ బెహల్ దర్శకత్వంలో ఒక హిందీ పాట పాడిన ఆశా అప్పటినుండి ఇప్పటివరకూ దాదాపు 18 భాషల్లో 12వేలకు పైగా పాటలు పాడారు. హిందీలో 8వేలు, మరాఠీలో 1200, గుజరాతీలో 450 పాటలు ఆమె *కంఠంనుండి జాలువారాయి.* ఇంకా ప్రజాదరణ పొందిన ప్రైవేట్ ఆల్బమ్‌లు అనేకం ఉన్నాయి. గాయనిగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఆశా చేసిన అనేక ప్రయోగాలు అనితరసాధ్యాలు. అవి సినీ సంగీత చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిపోతాయి. గొంతు విప్పి 56 ఏళ్లు గడచినా, 69 ఏళ్ల *ముదివయసులో సైతం ఆమె గళంలో* వన్నెలు తగ్గలేదు. మార్దవం చెక్కు చెదరలేదు. ఎలాంటి పాటకైనా ప్రాణం పోయడం ఆమెకే చెల్లింది. అంతే కాదు వైవిధ్యభరితమైన పాటలకు ఆశా పెట్టింది పేరు. పాటలోని భావానికి తగిన మాడ్యులేషన్, అందుకు అనుగుణమైన గాత్రం కలబోసి పాటను పండించడం ఆమె ప్రత్యేకత. వైవిధ్యభరితమైన ఆమె గళాన్ని మెచ్చుకుంటూ షమ్మీకపూర్ ఒకసారి ఇలా అన్నారు. "రఫీసాబ్ అందుబాటులో లేకపోతే నాకు నేపధ్యగానాన్ని అందించాల్సిందిగా ఆశానే అడిగిఉండేవాణ్ణి." ఒక గాయనికి ఇంతకన్నా కావల్సింది ఏముంటుంది. అటు శాస్త్రీయ, లలిత సంగీతాలైనా, ఇటు రాక్, పాప్, డిస్కో, క్యాబరే ఐనా ఆశా గళం అందుకు అనుగుణంగా మారిపోతుంది. ఓపి నయ్యర్ – ఆశా కాంబినేషన్‌లో వెలువడిన 'నయాదౌర్', తుమ్‌సా నహి దేఖా లాంటి చిత్రాలు సంగీత పరంగా సంచలనాన్ని

మీనా, ఆశా, లత, హృదయనాథ్, ఉష

స్వంత కాళ్ళపై నిలబడ్డా : అదిచాలు

దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాన్ని అందుకుంటున్న విలక్షణ గాయని ఆశాభోంస్లే వ్యక్తిగత జీవితంలోని కొన్ని పుటలను, అభిరుచులను ఇలా వివరించారు.

మీ జీవితమంతా కష్టామయమని అంటుంటారు అత్యంత కష్టకాలమని మీరు భావించేది ఏది?

ఇదీ అని చెప్పలేను. ఎన్నో కష్టాలను అనుభవించాను. కట్టుబట్టలతో ఇంటి నుండి బైటకొచ్చిన నేను ఒకానొక దశలో ఎటు వెళ్ళాలో తేల్చుకోలేని దిక్కుతోచని స్థితిలో రోడ్డుపై నిల్చున్నాను. 1960 నుండి నాకాళ్ళపై నిలబడడానికే ఎంతగానో శ్రమ పడ్డాను. ఇప్పటికి అనుకొన్నది సాధించగలిగాను. పిల్లలను పెంచి, ప్రయోజకులను చేశాను.

మీ జీవితంలో మంచి రోజేది?

1949లో మా పెద్దబ్బాయి హేమంత్ పుట్టిన రోజే.

మీరు పాడిన మొదటి పాట?

ఒక మరాఠీ పాట అది. 'చలా చలా మజా నవా బలా' అని సాగే ఆ పాట 1943లో రికార్డు చేశారు. మొదటగా హిట్టయింది పరిణీతలోని 'గోరెగోరె హాథన్ మే' పాట. నయాదౌర్‌లోని పాటలు మొట్టమొదటగా నాకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి.

మీ గొంతుకు మీ సోదరి లతామంగేష్కర్ గాత్రానికి తేడా ఏమిటి?

అక్క గళం నా కన్నా కొంచెం సన్నగా ఉంటుంది. ఆమెతో పోల్చితే నా గాత్రం మంద్రంగా ఉంటుంది. అయితే అక్క గాత్రం ఎంతో తీయనైనది. అక్కకు నూర్జహాన్ స్టయిల్ ఎంతో ఇష్టం. కానీ వాళ్ళిద్దరి వాయిస్‌లలో చాలా తేడా కన్పిస్తుంది. మాడ్యులేషన్‌లో కూడా అది మనం గుర్తించవచ్చు.

లత వివాహం చేసుకొని ఉండాల్సిందనుకొంటున్నారా?

లేదు. ఆమె వద్దగానీ, ఆమె పరోక్షంలోగానీ దీనిపై ఎప్పుడూ నేను మాట్లాడలేను. అయితే ఆర్టిస్టు ఎవ్వరూ పెళ్ళి అనేది చేసుకోకూడదని నేను నమ్ముతాను. భార్య మంచి గుర్తింపు పొందితే భర్తలో ఒక రకమైన కాంప్లెక్స్ పెరుగుతుంది. ఇక జీవితం నరకప్రాయమే.

నెంబర్ ఒన్ స్థానంపై మీ అభిప్రాయం?

ఈ అంకెల గారడీలపై నాకు నమ్మకం లేదు. సూర్యచంద్రులలో ఎవరు గొప్పంటే ఏం చెబుతాం? ఎవరి ప్రత్యేకత వారిదే.

లత, మీరు కలుసుకున్నప్పుడు దేని గురించి మాట్లాడుకుంటారు?

పాటల గురించి మాత్రం అస్సలు మాట్లాడుకోం. మా కబుర్లన్నీ పసందైన వంటకాల గురించే. అన్నట్లు చెప్పడం మరిచా. లత మంచి బాగా పాడి వీనుల విందు చేస్తుందో అంతకన్నా బాగా మంచి వంటకాలు కూడా చేస్తుంది.

మీకు కోపం కల్గించేది? ఆనందం కల్గించేది ఏది?

కోపం సంగతేమోగానీ బాగా బాధలో ఉంటే మాత్రం వెంటనే చీరల షాపింగ్‌కి బయలుదేరతాను. కళానికేతన్‌కు వెళ్ళి అక్కడి చీరలు చూస్తుంటే ఓహ్! నన్ను నేను మరచిపోతాను.

సృష్టించాయి. వినూత్న గీతికలనందించాయి. ఇంకా మేరే సనమ్, కాశ్మీర్ కీ కలీ, ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా, ప్రాణ్ జాయె పర్ వచన్ న జాయే వంటి సినిమాలలోని ఆశా పాడిన పాటలు ఆమెకు అసంఖ్యాకమైన అభిమానులను సంపాదించిపెట్టాయి. 60లలో 'చైనా టౌన్' లో హెలెన్ 'ఫన్ డ్యాన్స్' పాట, 'హౌరాబ్రిడ్జి'లో మధుబాలకోసం పాడిన 'ఆయియే మెహర్‌బాన్' పాట సరికొత్త ట్రెండ్‌ను సృష్టించాయి. 70లలో సంచలనం సృష్టించిన ఎల్విన్ ప్రెస్లీ 'రాక్ అండ్ రోల్' స్టయిల్లో 'ఇన మిన డికా' అంటూ వంద వంకర్లతో గొంతును పరవళ్లు తొక్కించిన ఆశా మరో సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికింది. తీస్రీ మంజిల్, ఉమ్రావ్ జాన్, ఇజ్జత్ వంటి చిత్రాలెన్నో ఆమె 'నేపథ్యగాయని' కెరీర్‌ను అత్యున్నత శిఖరాలకు తీసుకువెళ్లాయి. ఒకవైపు సంగీత 'వటవృక్షం' సోదరి లతామంగేష్కర్ నుండి పోటీని తట్టుకుంటూనే అస్థిత్వాన్ని నిలుపుకుంటూ రాణించగలగడం, తనదైన బాణీలో దూసుకు వెళ్లగలిగడం ఆశా మొక్కవోని దీక్షకు దర్పణాలుగా నిలుస్తాయి. 'రాజ్‌కీ బాద్', 'హమ్ కిసీ సే కమ్ నహీ' లాంటి ఖవాలీలు, 'సున్ లే పుకార్' లాంటి భజన గీతాలు, 'ఇస్ ఆంఖ్ మస్తీ కే' లాంటి గజళ్లు, 'పియా తూ', దునియా మే', 'రేష్మీ ఉజాలా హై' లాంటి క్యాబరే గీతాలు ఆశా వైవిద్యభరిత ప్రజ్ఞకు కొన్ని మచ్చు తునకలు మాత్రమే. సోదరి లతామంగేష్కర్ సినీ నేపథ్యగానంతో అగ్రస్థానంలో వున్నప్పటికీ తనదైన విలక్షణ శైలితో ఆషా తనకొక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలిగారు.

తెలుగులో 'పాలునీళ్లు' చిత్రంలో సత్యం సంగీత దర్శకత్వంలో తొలిసారిగా పాడిన ఆశాభోంస్లే 'చిన్నికృష్ణుడు', 'అంతం', 'పవిత్రబంధం', 'అశ్వమేధం', వంటి సినిమాల్లో తన గళాన్ని తెలుగు ప్రేక్షకులకు, సంగీతాభిమానులకు వీనుల విందు చేశారు.

నూతనత్వానికే ప్రాధాన్యత

నేపథ్యగానానికి ఉన్న పరిమితులను, విస్తృతినీ అర్ధం చేసుకున్నది గనుకనే ఆశా 90వ దశకం వచ్చే సరికి నూతనత్వం కోసం పరితపించారు. రీమిక్స్‌ల ద్వారా, పాప్ ఆల్బమ్స్ ద్వారా శ్రోతలను ఉర్రూతలూగించారు. 'జాయియే ఆప్ కహా జాయేంగే', యే హై రేష్మీ జుల్ఫోంకా అంధేరా' వంటి లలిత గీతాలను ఆలపిస్తూనే మరోవైపు 'దమ్ మారో దమ్' అంటూ హాస్కీ పాటలను ఎత్తుకోగలగడం ఆమెకే చెల్లింది. 'యాయిరే యాయిరే' అంటూ ఊపున్న 'రంగీలా' పాటలకు కూడా ఆశా కావాల్సిందే. ఆశా కంఠానికి ఉన్న 'రేంజ్' అటువంటిదని సినీ విమర్శకులు సైతం ఒప్పుకోక తప్పదు. ప్రస్తుతం సంగీత ప్రపంచాన్ని మరో ప్రపంచం ముంగిట నిలిపిన 'లగాన్' చిత్రంలోని 'రాధా కైసే నజలే' గీతం ఆశా గొంతులోంచి జాలువారినదే. ప్రముఖ పాకిస్తానీ గజల్ గాయకుడు గులాం ఆలీతో కలిసి రూపొందించిన 'మీరాజ్ ఏ గజల్', స్టీఫెన్ లాస్కాంబ్, విన్ క్లార్క్ లతో కలిసి చేసిన 'ఎవా మారియా' ఆల్బంలు ఆశాకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ప్రముఖ పాప్ గాయకుడు బోయ్ జార్జితో కలిసిచేసిన 'బౌడౌన్ మిస్టర్', తాను స్వయంగా రూపొందించిన 'రాహుల్ అండ్ ఐ' ఆల్బంలతో ఆశా అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ☆

అవార్డులు రివార్డులు

భారత సంగీత సామ్రాజ్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని అవిశ్రాంతంగా పురోగమిస్తున్న ఆశాకు ఇప్పటికి రెండుసార్లు జాతీయ స్థాయిలో ఉత్తమగాయని అవార్డు లభించింది. ఎనిమిది సార్లు ఫిలింఫేర్ అవార్డులు, 2001 సంవత్సరానికి గాను ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డును కూడా స్వంతం చేసుకున్నారు. ఐదుసార్లు ఎంటివి, ఛానెల్ వి అవార్డులను అందుకున్నారు. 14 సార్లు మహారాష్ట్ర ప్రభుత్వ అవార్డులు స్వీకరించారు. ప్రపంచప్రఖ్యాతి పొందిన 'గామీ' అవార్డుకు నామినేట్ అయిన మొట్టమొదటి భారతీయ గాయని ఆశానే కావడం విశేషం. ఉస్తాద్ ఆలీ అక్బర్‌ఖాన్‌తో కలిసి ఆశా రూపొందించిన 'లెగసీ' ఆల్బం ఆమెకు ఈ అరుదైన అవకాశాన్ని తెచ్చిపెట్టింది.

పక్షవాతం అంటే...

డా॥ గోపాలం శివన్నారాయణ



రెండు కాళ్ళు, రెండు చేతులతో తన పని తను చేసుకుంటూ, నలుగురికి ఉపయోగపడే మనిషి మంచానపడి, మలమూత్ర విసర్జనకు సైతం నలుగురి సహాయాన్ని అర్థించడమనేది కష్టతరమైన, బాధాకరమైన స్థితి. అది మనిషికి గొప్ప శిక్ష. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరు ప్రతి క్షణం ఆసరాగా వుంటూ ఆ రోగికి ధైర్యం చెబుతూ అండగా వుండాలి.

పక్షవాత రోగి వీలైనంత వరకు తన పని తను చేసుకోగలిగే పరిస్థితుల్ని కల్పించాలి. అందుకనే పక్షవాతం వచ్చిన వెంటనే ఏ మాత్రం కాలయాపన లేకుండా, ఏ మాత్రం అనుమానాలు పెట్టుకోకుండా రోగిని న్యూరాలజిస్ట్ దగ్గరకు తీసుకొని వెళ్ళాలి.

1. పక్షవాతం అంటే ఏమిటి? శరీరంలో సగభాగం చచ్చుబడిపోవటం.
2. ఇది ఎలా జరుగుతుంది ? మెదడుకి రక్తప్రసరణ ఆగినందువలన జరుగుతుంది.
3. రక్తప్రసరణ ఎందుకు ఆగిపోతుంది ? రక్తనాళాల్లో కొవ్వు గడ్డలు తయారయి అడ్డు తగిలినపుడు ఇది జరుగుతుంది.
4. రక్తనాళాల్లో కొవ్వు పెరగడానికి అనేక కారణాలున్నాయి.

పక్షవాతం ఎందుకు వస్తుంది, ఎవరికి వస్తుంది?

ముసలి వయస్సు, రక్తపోటు (బి.పి.), మధుమేహ వ్యాధి (షుగర్), పొగత్రాగటం, రక్తంలో చెడ్డ కొలెస్ట్రాల్ ఎక్కువ అవటం వంటి కారణాల వలన రక్తనాళాల్లో కొవ్వు పెరుగుతుంది.

రక్తం గొట్టంలో ఎంత కొవ్వు వుంటే అంత ఎక్కువ వయస్సు అని అర్థం చేసుకోవాలి.

పక్షవాతం రాకుండా పైన చెప్పిన ఐదు కారణాలను అదుపు చేయాలి.

పక్షవాతం వచ్చిన తరువాత వైద్యం ఎందుకు?

ఎ. మంచిగ వున్న రెండో వైపు కూడా చచ్చు కాకుండా వుండటానికి

బి. చచ్చుబడిన భాగం కోలుకోవటానికి, కోలుకున్న భాగం తిరిగి చచ్చుబడకుండా వుండటానికి.

పక్షవాతం తీవ్రత అంటే ఏమిటి? తెలుసుకోవడం ఎలా?

మెదడు ఎంత ఎక్కువ జబ్బున పడితే అంత పెద్ద జబ్బు వున్నట్లు అనుకోవాలి. ఉదాహరణకి పది మంది పని చేసే చోట ఎంతమంది మానేస్తే అంత పెద్ద కష్టం.

పక్షవాతం నుంచి కోలుకోవటం అంటే ఏమిటి?

మిగిలిన నరాలు, మానేసిన నరాల పని ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత ఎక్కువగా కోలుకోవటం వుంటుంది. ఎక్కువ పనులు చేసే అవయవానికి ఎక్కువ నరాలు కావాలి. ఉదాహరణకి కాలుకి - పదికి రెండు నరాలు పని చేస్తే చాలు. చేతికి - పదికి ఎనిమిది నరాలు పని చేస్తే చాలు. మాట కొరకు పదికి పది నరాలు పని చేయాలి. అందుకే పక్షవాతం వచ్చిన వాళ్ళకు కాలు 99% కోలుకోవటం జరుగుతుంది.

పక్షవాతం జబ్బులో డాక్టరు పని ఏమిటి?

పక్షవాతం వచ్చిన రోగికి మిగిలిన నరాలను చచ్చుబడకుండా చూడాలి. మానేసిన నరాలు ఏ జబ్బులతో దెబ్బతిన్నవో, ఆ జబ్బుల ప్రభావం మిగిలిన నరాల మీద పడకుండా చేయాలి. ఉదాహరణకి : బి.పి., షుగర్, కొవ్వులను తగ్గించడం, రక్తనాళాల్లో పలుచటి రక్తం ప్రవహించటానికి మందులు వాడటం, రక్తనాళాల్లో కొవ్వు ఎక్కువగా వుండి అడ్డుపడితే వాటిని కనిపెట్టి వీలు అయితే ఆపరేషను ద్వారా తొలగించాలి. పొగాకు వాడకం మానిపించటం అవసరం.

ట్రైనింగు/శిక్షణ/ఫిజియోథెరపి అంటే?

మానేసిన నరాల పనులు మిగిలిన నరాలకు నేర్పడాన్ని ఫిజియోథెరపి అంటారు. మిగిలిన నరాలకు సంఖ్య ఎక్కువ వుంటే, జబ్బులు తక్కువ వుంటే, వయస్సు తక్కువ వుంటే, శక్తి ఎక్కువ వుంటే కోలుకోవటం సులువు.

మనుషులను పీల్చిపిప్పి చేసే క్షయ వ్యాధి

డా॥ ఎస్.సతీష్ మాధవ

టి.బి. (క్షయ వ్యాధి) ఒక అంటువ్యాధి. ఇది బాక్టీరియా వలన కలుగుతుంది. ఇది ముఖ్యంగా ఊపిరితిత్తులకు వస్తుంది.

ప్రపంచ జనాభాలో మూడవ వంతు అనగా 190 కోట్ల మందిలో టి.బి. క్రిములు ఉన్నాయి. ప్రపంచంలోని ప్రతి ఐదుగురు టి.బి. రోగులలో ఇద్దరు మన దేశానికి చెందిన వారు. ప్రస్తుతం మన దేశంలో సుమారు రెండు కోట్ల మంది టి.బి. వ్యాధితో బాధపడుతున్నారు. మన దేశంలో ప్రతి నిమిషానికి ఒకరు, రోజుకు వెయ్యిమంది, సంవత్సరానికి ఐదు లక్షల మంది టి.బి. జబ్బుతో చనిపోతున్నారు.

వ్యాధి వ్యాపించే విధానం :

ఈ వ్యాధి సోకిన రోగులు దగ్గినప్పుడు, మాట్లాడినప్పుడు క్రిములు గాలి ద్వారా మరొకరికి సోకుతాయి. చికిత్స లేకుండా వున్న ఒక టి.బి. రోగి ఒక సంవత్సరంలో 10 నుండి 15 మందికి ఈ వ్యాధిని

సంక్రమింపచేస్తారు.

వ్యాధి లక్షణాలు :

మూడు వారాల కన్నా ఎక్కువ కాలం దగ్గు, కఫము పడుట, అప్పుడప్పుడు దగ్గితే రక్తము పడుట, జ్వరము, చెమటలు పట్టుట, ఛాతీలో నొప్పి, ఆకలి మందగించుట, బరువు తగ్గిపోవుట, ఆరోగ్యం సరిగా లేదనే భావన మొదలైనవి ఈ వ్యాధి లక్షణాలు.

వ్యాధి నిర్ధారణ :

టి.బి. వ్యాధిని ఉమ్మి పరీక్ష, ఛాతి ఎక్సరే, టీకా పరీక్షల (5 సంవత్సరాల లోపు పిల్లలకు మాత్రమే) ద్వారా నిర్ధారించవచ్చు.

టి.బి.వ్యాధి చికిత్స :

ఈ వ్యాధి చికిత్సకు పూర్తి కాలము ఆసుపత్రిలో నుండనవసరం లేదు. ఈ రోగానికి చికిత్స చేయడానికి అనేక రకాలైన మందులను సుదీర్ఘకాలం



ఉపయోగించాలి. చికిత్సకు ప్రతి ఒక్కమందు చాలా ముఖ్యం. ఈ మందులను సరైన విధంగా తీసుకొనని యెడల "మందులకు లొంగని క్షయ" వచ్చే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధికి చికిత్స చాలా ఖర్చుతో కూడినది. అంత ఖర్చు పెట్టినా 50 శాతం మందిలో మాత్రమే నయం అవుతుంది.

వ్యాధి నివారణ :

1. చిన్న పిల్లలకు 'బి.సి.జి.' వాక్సిన్ చేయించాలి.
2. మీరు దగ్గినప్పుడు, ఉమ్మినప్పుడు లేదా వేరెవరైనా దగ్గుతున్నప్పుడు మీ ముఖాన్ని చేతి రుమాలుతో కప్పుకోండి.
3. బహిరంగ ప్రదేశాలలో ఉమ్మవద్దు
4. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోండి.
5. ఆరోగ్యకరమైన జీవన పద్ధతులను పాటించండి. ధూమపానం, మధ్యపానాలకు స్వస్తి పలకండి.
6. వైద్యులు నిర్ధారించిన మందులను పూర్తికాలం వాడండి.



డాక్టర్ సలహాలు

నా ముఖంపై చిన్నచిన్న కురుపులు వున్నాయి. ఇవి పోవాలంటే ఏమి చేయాలి?

– **సతీష్**, విశాఖ

మీరు ముఖంపై కురుపులు ఉన్నాయని వ్రాశారు. అవి చీము గుల్లలా? లేక మొటిమలో వ్రాయలేదు. మీ వయస్సు కూడా తెలిపివుంటే బాగుండేది. చీము గుల్లలైతే 'యాంపిలాక్స్ 500 ఎంజి' క్యాప్సుల్స్ రోజుకు రెండుచొప్పున ఏడురోజులు వాడితే తగ్గిపోతాయి.

నాకు విపరీతంగా ముఖం మీద చెమటలు పడుతుంటాయి. ఎన్నిసార్లు ముఖం కడుక్కున్నా ఇలాగే అవుతోంది. దీనికి కారణం ఏమిటి?

– **పి.ఎస్.ఎస్.కిరణ్**, రామచంద్రాపురం

మీరు ముఖంపై విపరీతంగా చెమటలు పడుతున్నాయని అంటున్నారు. ఆందోళన ఎక్కువగా వుంటే చెమటలుపట్టే అవకాశం వుంది. మామూలుగా మీరు ఆందోళనను కంట్రోల్ చేయగలిగితే తగ్గిపోతుంది. ఆందోళనను కంట్రోల్ చేసుకోలేకపోతే మానసిక వైద్యుని సంప్రదించగలరు.

నా కింది పెదవి మీద రెండు పక్కలా కొంచెం కొంచెం ఎర్రగా మచ్చగా వుంటుంది. మిగతా భాగం ఎరుపుగా ఉంటుంది. ఎందుకని?

నా వళ్ళంతా దురదగా ఉంటుంది. ఏ మందు వాడితే తగ్గుతుందో తెలపగలరు?;

– **ఎల్.ఎం.కె.రావ్**, ఉండి

మీరు పెదవిపై రెండుపక్కలా ఎర్రగా మచ్చవుందని రాశారు. మీ అలవాట్లు రాసివుంటే బాగుండేది. సిగరెట్ తాగే అలవాటు వున్నవారికి ఇలా వచ్చే అవకాశంవుంది. లేకపోతే 'విటిలిగో(బొల్లి)' అని తెలుసుకోవడానికి దగ్గరలోని చర్మవ్యాధి వైద్యనిపుణులను సంప్రదించగలరు.

నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. నా మొఖంపై మొటిమలు వున్నాయి. ఇవి తగ్గడానికి ఎన్నో రకాల మందులు వాడాను. తగ్గలేదు. కారణం తెలియచేయగలరు.

– **ఎన్.సురేష్**, విజయనగరం

మీరు ముఖంపై మొటిమలు వున్నాయని రాశారు. చాలా మందులు వాడానని కూడా రాశారు. ఏమందులు, ఎంత మోతాదు, ఎన్నిరోజులు వాడింది రాయలేదు. కావున మీరు 'డాక్సిసైక్లిన్ 100ఎంజి' బిళ్ళలు రోజుకు రెండుచొప్పున ఆరువారాలు వాడవలెను. పూతకు 'బెన్జాయిక్ ఎ.సిజి' ఆయింట్‌మెంట్‌ను రాత్రిపూట, 'క్లిండామైసిన్'ను పగటిపూట మొటిమలు వున్నచోట మర్ధన చేయవలెను. రోజుకు నాలుగైదుసార్లు ముఖం కడుక్కుని పొడి టవల్‌తో శుభ్రంగా తుడుచుకోవాలి.

డాక్టర్ కె.ఎస్.రాజు, ఎం.బి.బి.ఎస్, ఎం.డి.,
చైతన్యహాస్పిటల్, పొగతోట, నెల్లూరు.

726679

పాత్రోచిత భాష



అంపశయ్య నవీన్

"కొంతకాలంగా మన తెలుగు సినిమాల్లో తెలంగాణా ప్రాంత ప్రజలు మాట్లాడే భాషను అపహాస్యం చేస్తూ చూపిస్తున్నారు. ఆ భాషను ఏ రౌడీలో, గూండాలో మాత్రమే మాట్లాడే భాష అన్నట్టుగా చూపిస్తున్నారు.... లేకపోతే... హాస్యగాళ్ళు, బఫూన్లు మాట్లాడే భాషగా చూపించి నవ్విస్తున్నారు... ఇట్లా ఒక ప్రాంతపు మాండలికాన్ని అపహాస్యం చెయ్యడం అన్యాయం, అక్రమం కాదంటారా? చాలా బాధాకరమైన విషయమేమిటంటే తెలంగాణా ప్రాంతీయులు కూడా సినిమాల్లో ఇలాంటి సన్నివేశాల్ని చూస్తూ ఎంజాయ్ చెయ్యడం... ఇట్లా ఒక ప్రాంతాన్ని, ఆ ప్రాంత ప్రజలు మాట్లాడుకునే భాషను అపహాస్యం చెయ్యడం వల్లనే వేర్పాటు ఉద్యమాలు తలెత్తుతాయి...." అంటూ వచ్చాడు మిత్రుడు శ్రీనివాసరావు.

"నిజమే... ఇప్పుడొస్తున్న కొన్ని సినిమాల్లో తెలంగాణా భాషను కేవలం విలన్ చేత, కమేడియన్ల చేత మాత్రమే మాట్లాడిస్తున్నారని నేనూ గమనించాను. అలాంటి సినిమాల్ని నేను కూడా కొన్నింటిని చూశాను... ఇట్లా మాట్లాడించటం కొత్తగా ఉంటుందనో, సహజంగా ఉంటుందనో సరిపెట్టుకోవడానిక్కూడా వీల్లేదు - సహజమైన భాషను మాట్లాడించడం కోసమే తెలంగాణా మాండలికాన్ని మాట్లాడిస్తున్నామన్న వాదనే నిజమైతే సినిమాల్లోని మంచి పాత్రలచేతకూడా ఆ భాష మాట్లాడించాలి. అలా కాకుండా కేవలం రౌడీల చేత, గూండాల చేత మాత్రమే మాట్లాడించడం దుర్బుద్ధితో కూడుకున్న పనే... నువ్వన్నట్టు ఇలాంటి పనుల వల్ల సమాజానికెంత హాని కల్గుతున్నదో ఈ సినిమా నిర్మాతలుగానీ, డైరెక్టర్లు గానీ గుర్తించడం లేదు" అన్నానేను

"అసలు మన తెలంగాణా ప్రేక్షకులకు బుద్ధిలేదంటాను - ఎందుకంటే తమ భాషను అపహాస్యం చేస్తున్న సినిమాలను కూడా వాళ్ళు ఎగబడి చూస్తున్నారు. అలాంటి సినిమాలను తెలంగాణా ప్రేక్షకులు బాయ్ కాట్ చెయ్యాలి.. అప్పుడు కానీ సినిమావాళ్ళకు బుద్ధొస్తుంది..." అన్నాడు శ్రీనివాసరావు.

"సినిమా చూడటానికి వెళ్ళేవాళ్ళు కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ కోసం వెళ్తారు... సినిమాహాల్లో కూర్చున్న ఆ రెండున్నర గంటలూ ఎక్కడా విసుగు లేకుండా హాయిగా గడిచిపోతే చాలనుకుంటారు... మరో విషయమేమిటంటే ఇవ్వాళ్ళ తెలంగాణాలో కూడా కాస్తో కూస్తో చదువుకొని ఆర్థికంగా పై మెట్టుమీదకెక్కినవాళ్ళందరు కూడా తెలంగాణా భాష మాట్లాడటం లేదు - అలాంటి వాళ్ళందరికీ వచ్చిండ్రు" "పోయిండ్రు" "గిప్పుడు" "గిట్ల" అంటూ మాట్లాడటం చిన్నతనంగానే కనిపిస్తున్నది... అందుకే ఇవ్వాళ్ళ తెలంగాణా వాళ్ళళ్ళో శిష్యులుగా మారిపోతున్న వాళ్ళందరూ వచ్చారు, పోయారు, ఇప్పుడు, ఇట్ల అనే మాట్లాడుతున్నారు.... కొంతకాలం క్రితం తెలంగాణా భాషలో ఉర్దూ పదాలు బాగా దొర్లుతుండేవి. ఇప్పటి పరిస్థితేమిటంటే ఇంగ్లీషు పదాలు విరివిగా దొర్లడం... ఇవ్వాళ్ళ ఎవర్ని చూసినా ఇంగ్లీషు మీడియంలో చదివేవాళ్ళే కనిపిస్తున్నారు... ఇలాంటి వాళ్ళందరూ మొదలు ఇంగ్లీషు నేర్చుకున్నాకే తెలుగు మొక్కుబడిగా మాత్రమే నేర్చుకుంటున్నారు.... ఇలాంటి వాళ్ళు మాట్లాడే తెలుగులో యాభైశాతానికి పైగా ఇంగ్లీషు మాటలే ఉంటున్నాయి... కొంతకాలం పోతే అసలు తెలుగు వాళ్ళెవరూ తెలుగు మాట్లాడరేమోననిపిస్తుంది... ఆంధ్ర తెలుగు, రాయలసీమ తెలుగు, ఉత్తరాంధ్ర తెలుగు, తెలంగాణా తెలుగు అని మనం తెలుగును ప్రాంతాలను బట్టి విభజిస్తున్నాము... ఏ ప్రాంతం వాళ్ళకు ఆ ప్రాంతపు తెలుగు మీద అభిమానం సహజంగా ఉంటుంది. అయితే ఈ మాండలికాలనన్నింటినీ ఇంగ్లీషు మింగేస్తుందనీ, అసలు కొంతకాలం పోతే తెలుగు - ఇంగ్లీషు మిక్సరే తెలుగుగా చలామణి అవుతుందని నా కనిపిస్తున్నది..." అన్నానేను.

"అదంతా ఎప్పుడో జరుగుతుందేమోగానీ ఇప్పుడైతే సర్కారు జిల్లాల వాళ్ళు మన తెలంగాణా తెలుగును చాలా చిన్న చూపు చూస్తున్నారు... వాళ్ళ జిల్లాల్లో మాట్లాడే భాషనే మనందరి మీద రుద్దుతున్నారు. రేడియో, సినిమా, వార్తాపత్రికలు, టీవీలాంటి మాధ్యమాల ద్వారా వాళ్ళు మన భాషను పూర్తిగా అణచేసి వాళ్ళభాషను మనమీద రుద్దారు - మనవాళ్ళు కూడా వాళ్ళ భాష మాట్లాడటమే నాగరికత అనుకొని మన తెలంగాణా భాషను వదిలేసి వాళ్ళ భాషనే మాట్లాడుతున్నారు.... అసలు మీ రచయితలు కూడా వాళ్ళ భాషలోనే కథల్నీ, నవలల్నీ రాసి మనభాషకు చాలా అన్యాయం చేస్తున్నారు.. మీరు మీ కథల్నీ, నవలల్ని పూర్తిగా మన తెలంగాణా మాండలికంలోనే రాయాలంటాన్నేను" అన్నాడు శ్రీనివాస్.

"గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమాన్ని తీసుకొచ్చిన రోజుల్లో చాలా మంది పండితులు వ్యావహారిక భాషావాదాన్ని వెక్కిరించారు. ప్రజలు నిత్యజీవితంలో మాట్లాడుకుంటున్న భాషలోనే రాయడం అసంభవం అన్నారు. ఉత్తరాంధ్రలో ఒకలా, రాయలసీమలో ఒకలా, కోస్తా జిల్లాల్లో ఒకలా, తెలంగాణాలో ఒకలా ప్రజలు తెలుగు మాట్లాడుతారు. మళ్ళీ ఒక్కొక్క జిల్లాలో ఒక్కోలా, ఒక్కొక్క కులంలో ఒక్కోలా కూడా మాట్లాడతారు. దీంట్లో దేన్ని వాడుక భాషగా తీసుకుంటారు? కాబట్టి వాడుక భాషలో రాయాలనడమే తప్పు... గ్రాంధికం ఒక్కటే ప్రామాణిక భాష" అన్నారు ఆనాటి పండితులు - దీనికి సమాధానంగా గిడుగు రామమూర్తి పంతులుగారు శిష్ట వ్యావహారికం అనే వాదాన్ని తీసుకొచ్చారు. కాస్త చదువుకొని శిష్టులుగా భావించబడే వాళ్ళు మాట్లాడే భాషే శిష్ట వ్యావహారికం అన్నారు... ఆ భాషనే పత్రికలు, రేడియో, సినిమా మొదలైన ప్రచార మాధ్యమాలు ఉపయోగించాయి... రచయితలు కూడా శిష్ట వ్యావహారికాన్నే వాడారు... అయితే నవలల్లోను, కథల్లో ఒక ప్రత్యేక ప్రాంతపు వాతావరణాన్ని సృష్టించడం కోసం ఆ ప్రాంతంలో మాట్లాడబడే భాషను పాత్రల చేత మాట్లాడించవచ్చు. దీన్నే పాత్రోచిత భాష అంటున్నారు... ఇవ్వాళ్ళ చాలా మంది రచయితలు ఈ పనే చేస్తున్నారు. నేను రాసే నవలల్లోని పాత్రలు తెలంగాణా ప్రాంతానికి చెందిన వాళ్ళయితే తెలంగాణా భాష మాట్లాడతారు... ఇట్లా కాకుండా మొత్తం కథంతా, నవలంతా మాండలికంలోనే రాస్తే ఆ మాండలికం మాట్లాడని పాఠకులు ఆ కథల్నీ, నవలల్నీ చదవలేరు... అర్థం చేసుకోలేరు. అప్పుడు చదవడమనేదొక పనిష్మెంట్‌గా మారుతుంది. అది రాయలసీమ మాండలి కావొచ్చు, ఉత్తరాంధ్ర మాండలికం కావొచ్చు, తెలంగాణా మాండలికం కావొచ్చు లేక కోస్తా జిల్లాల మాండలికం కావొచ్చు... ఏదైనా పాత్రోచితంగా ఉంటేనే బావుంటుందని నా అభిప్రాయం" అన్నానేను.

"మీ అభిప్రాయంతో నేను ఏకీభవించను సార్" అంటూ వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు. ☆

ఒక అసందర్భ ప్రేలాపన



ఇప్పుడిది సమయం కాదు
అయినా అంటున్నానీమాట
వేల శరీరాలు ఛిద్రమైన బీభత్స దృశ్యానికి
ఒక్క క్షణం నిర్ఘాంతపోవడమే తప్ప....
కన్నీళ్లు రావడం లేదు
ఈ ఏకధృవ ప్రపంచాన్ని శాసిస్తోన్న
ఆ రెండు సౌధాలు
నిలువునా కూలుతున్న దృశ్యం
ఒక అహంకారం - వొక అధికారం
జంటగా కూలుతున్నట్టుగా
నాక్కనిపిస్తోంది
ఆ కాంక్రీట్ జనారణ్య మహావృక్షాల
శిథిలాల కింద
శకలాలు - శకలాలుగా మారిన
వేలాది ప్రాణదీపాలు కొడిగట్టిన వైనం
కదిలించడం లేదు

★ ★ ★ ★ ★ ★

మతం - సహజీవనం నేర్పదని తెల్సినా
ఉగ్రవాదమై - అగ్రరాజ్యమై
రూపం మార్చుకొని
మధ్యయుగాల వైపు సాగుతున్న
ప్రయాణంలో
వెంటాడే పరాభవం
యుద్ధానికి సన్నద్ధమని
కాలుదువ్వుతుంటే
ఇక శాంతి - వొక భ్రాంతి
హింస - వొక పరమహంస

★ ★ ★ ★ ★ ★

ఇరాక్ ఇంటింటిలో ఆరిపోయిన
చిన్నారి దీపాలు
పాలస్తీనా పవిత్రభూమిలో ప్రవహిస్తోన్న
నెత్తుటి ధారలు
వియత్నాం వీధుల్లో విచ్చుకత్తులు
మొలిచిన దారులు
కొసావో కొలిమి మంటల్లో మసైన
మానప్రాణాలు
చిట్టితల్లి చిలీ నుదుట అలెండీ
సిందూరం చెరిగిన క్షణాలు
నాగసాకి - హిరోషిమా నగరాల్లో
నవ్వుల్ని మరచిన మట్టితల్లి బేలచూపులు
వొక్కటొక్కటిగా వెంటాడుతుంటే...
నా అస్తిత్వాన్ని అంగుళం దూరం
నుండి కూడా
నిఘావేస్తున్న - వాడి
వాణిజ్య కేంద్రాలు వాలిపోయిన దృశ్యం
"పెంటగాన్ రక్షణ" పేలిపోయిన దృశ్యం
కదలించడం లేదు
కన్నీళ్లు కురిపించడం లేదు

★ ★ ★ ★ ★ ★

అందరూ - వాడి
డాలర్ దర్పానికి గులాములైనప్పుడు
స్వాభిమానాన్ని స్వేచ్ఛగా తార్చుతున్నప్పుడు
దేశదేశాల సానుభూతి వాక్యాలు పతాక
శీర్షికలౌతాయి
ఆలివ్‌కొమ్మల ఆర్తగీతాలతో ఎలిజీలు పాడ్తాయి

★ ★ ★ ★ ★ ★

నా ప్రపంచ ప్రజలారా!
వేయినాల్కలు సాచి బుసలు కొడుతున్న
సామ్రాజ్యవాదం
వెలుగు రెప్పలు మూసేసేరోజు సమీపిస్తున్నది
ఏబదినగరాల స్వేచ్ఛాసౌభాగ్యాల కోసం
మన వేలాది నగరాలు
వెన్నెల రాత్రుల్ని - వెచ్చని వెలుగుల్ని
కోల్పోయే కాలం - కాటువేయ
చేరువవుతున్నది

★ ★ ★ ★ ★ ★

మతాల పొట్లగిత్తల నడుమ లేగదూడ
మానవత

- మంగు జయప్రకాశ్

నా పేరు అమెరికా!

నా పేరే అమెరికా!
అణుయుద్ధం నా కోరిక !

హిరోషిమా, నాగసాకీలు
కనుసైగతో శ్మశాన వాటికలు!
నన్నెదిరించిన వారందరికి
పేరుస్తాను శవపేటికలు!

అలెండీని కూల్చాను
లుముంబాను తిన్నాను
డొమినికన్ రిపబ్లిక్కు
బొమికలు విరిచేశాను

వియత్నాం, కంపూచియాను
రక్తంతో నింపాను
అంగోలా కాంగోలను
అల్లకల్లోలం చేశాను

ఇరాకును చిరాకుపరిచి
ఇరానును పరేశాను చేసి
యుగోస్లావియా పైకి
'యుద్ధవీరులను' పంపాను

క్యూబాపై మున్నెన్నడో
దాడి చేసె కెన్నెడో
అతడే మా కాదర్శం
లేదు వేరు ఆశయం!

అతి చౌకగ అమ్ముతాను
అణుబాంబులు, ఆయుధాలు
ప్రతిదేశం వెనుక
తవ్వుతాను గోతులు!

తాలిబాన్ నీడలో
లాడెన్‌ను ఆడించాను
తాళం వేయుటమరిచాను
తలకొరివి పెట్టించుకున్నాను

- కె.ఖాదర్‌బ

...ా స్వేచ్ఛగా
...ాచ్చినట్లు'
వేసుకొని

...మూర్తి

3

పిల్లలకు నచ్చే ఆహారం పెడుతున్నారా?

సింహాద్రి సరోజిని

'తిండికలిగితె కండకలదోయ్

కండకలవాడేను మనిషోయ్'

అన్నారు మహాకవి గురజాడ. శారీరక, మానసిక ఆరోగ్యం వుంటేనే బలం వుంటుంది. ఆ బలం సక్రమమైన ఆహారంతోనే సమకూరుతుంది. చక్కటి ఆహార అలవాట్లు వుంటేనే ఎవరైనా శారీరకంగా, మానసికంగా వుల్లాసంతో గడపగలరు. మనుషులు అన్ని విధాలా ఆరోగ్యంగా వుండాలంటే సరైన ఆహారపు అలవాట్లు వుండాలి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో మంచి ఆహార అలవాట్లు వుండేలా చూసుకోవడం అవసరం. ఎందుకంటే మనిషి శారీరక, మానసిక ఎదుగుదల పసితనం నుంచే చక్కగా వుంటేనే వారు అన్ని రంగాలలో రాణించగలుగుతారు.

చాలామంది పిల్లలు తిండితినటం దగ్గరకు వచ్చేసరికి ఎన్నో పేచీలు పెడతారు. అన్నం సరిగా తినకపోవడమనేది పసితనం నుంచే ప్రారంభమవుతుంది. సాధారణంగా పిల్లలు అన్నం తినకుండా మొండికేస్తుంటే కొందరు తల్లులు చందమామరావే, జాబిల్లిరావే అని పాటలు పాడుతూ తినిపిస్తారు. మరికొందరు తల్లులు బూచోడు వస్తాడని, రాక్షసుడొస్తాడంటూ భయపెట్టి తినిపిస్తారు. కొందరేమో చుట్టుపక్కల ఇళ్ళ చుట్టూ తిప్పుతూ పిచ్చుకలను, కాకులను చూపుతూ తినిపిస్తారు.

మా పాప చిన్నప్పుడు అన్నం చాలా బుద్ధిగా తినేది. అయితే ఆమెకు ఆకలైతేనే అలా చేసేది. ఆమెకు ఆకలి వేయగానే పీట వాల్చుకొని, గ్లాసుతో నీళ్ళు ముంచి పెట్టుకొని కూర్చునేది. ఆమెకు బాగా ఆకలి వేసిందని దానిని బట్టి మనం గ్రహించాలన్నమాట. అని చెప్పే తల్లులు చాలా తక్కువ మందే మనకు కన్పిస్తారు. ఇలా బుద్ధిగా అన్నం తినే పిల్లలు మనకు చాలా తక్కువగానే కన్పిస్తారు. చిన్న పిల్లలకు సాధ్యమైనంత వరకు చిరుతిళ్ళు తక్కువగా అలవాటు చేస్తే అన్నం తినడం లేదనే బాధ వుండదు.

మాకు తెలిసిన వారి పిల్లలున్నారు. ఆ నియోజకవ కనీసం ఐదారేళ్ళు వచ్చే వరకు కూడా ఎత్తుకొని శతాబ్దాల హైద్సం తినిపించాల్సి వచ్చేది. ఒక్కోసారి వారికి ...చడానికి పక్క ఇళ్ళకు కూడా తీసుకెళ్ళవలసి ...ునా కూడా వారు ఒక పట్టాన అన్నం ...దు. అయితే ఆ పిల్లలు అలా వేందుకు ... నేను కొద్ది రోజులు గమనిస్తే నాకొక ...లిసింది. ఆ పిల్లలకు ప్రతిపావు గంటకు, ...డబ్బులిచ్చి కొట్టుకు పంపేవారు. వారు కోట్లో ... కొని తింటూ వుండేవారు. ఈ రకంగా ...కుండా చిరుతిండ్లు తింటుంటే యింకవారు ...ంటారు.

... కొందరు పిల్లలు చిరుతిండ్లు తినకపోయినా ...ం తినరు. తినడం లేదు కదా అని మనం ...లాగే వదిలేస్తే అదో అలవాటు ...ోవచ్చు. దానితో శరీరానికి తగినంత పోషక ...భించక పిల్లలు బలహీనపడిపోతారు. వారిలో ... శక్తి క్షీణించిపోయి తరచుగా అనారోగ్యం ...అవకాశముంది. పిల్లలు వరుసగా అన్నం ...నేస్తే డాక్టర్‌ను సంప్రదించి వారు తిరిగి ... అన్నం తినేలా చేయాలి. కొందరు పిల్లలు ...న్నమే తినమంటే తినరు. అలాంటి పిల్లలకు బ్రెడ్, చపాతీ, పండ్లు తినిపించినా సరిపోతుంది. పాలు, పండ్ల రసాలు కూడా పట్టవచ్చు. ఏదేమైనా తల్లిదండ్రులు బుజ్జగించో, లాలించో పిల్లలు సక్రమంగా ఆహారం తీసుకునేలా చూడాలి.



పెద్దవారి మాదిరిగానే పిల్లలు కూడా శారీరకంగానే గాక మానసిక అశాంతికి గురైనప్పుడు సక్రమంగా ఆహారం తీసుకోరు. పిల్లలకు మానసిక అశాంతి ఏముంటుందని మనం అనుకోవచ్చు. కానీ ఇల్లు మారినప్పుడు, స్కూలు మారినప్పుడు, ఊరు మారినప్పుడు, కుటుంబంలో సంభవించే మరణాలు, కుటుంబ కలహాలు పిల్లలకు మానసిక అశాంతిని కల్గించవచ్చు. అలాంటప్పుడు తల్లిదండ్రులు వారిలోని మానసిక అశాంతిని దూరం చేయడానికి ప్రయత్నించాలి. చిన్న పిల్లలు సాధారణంగా వృద్ధులతో సన్నిహితంగా వుంటారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలతో వారు ఎక్కువ సన్నిహితంగా వుంటారు. వారెవరైనా అకస్మాత్తుగా మరణించినప్పుడు పిల్లలు బెంగ పెట్టుకుంటారు. అలాంటప్పుడు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగే ఆప్తులు ఏదైనా కారణాల వల్ల దూరమైనప్పుడు కూడా పిల్లలు మనోవ్యథకు గురై సరిగా ఆహారం తీసుకోరు. అలాంటప్పుడు తల్లి దండ్రులు పిల్లలను బుజ్జగించి, వారి బెంగను తీర్చి సక్రమంగా ఆహారం తీసుకొనేలా చూడాలి. అటువంటి సందర్భాలలో పిల్లలకు మానసిక నిబ్బరం కల్గించినట్లయితే త్వరలోనే వారు బెంగను మరచి మామూలుగా మారతారు.

పిల్లల్లో ముఖ్యంగా మనకు రెండు రకాల మనస్తత్వం కనిపిస్తుంది. కొందరు పిల్లలు ఆకలిగా వున్నప్పటికీ సక్రమంగా తినరు. మరికొందరు పిల్లలు తమకు యిష్టమైన పదార్థాలు కన్పిస్తే అతిగా తిని అనారోగ్యం తెచ్చుకుంటారు. ఈ రెండు పద్ధతులూ మంచివి కావు. పిల్లలు అన్ని వేళల్లోనూ తగినంతగా ఆహారం తీసుకొనేలా పెద్దలు శ్రద్ధ వహించాలి. పిల్లలు సక్రమంగా ఆహారం తీసుకోకపోవడమనేది వారసత్వరీత్యా కూడా రావచ్చని శాస్త్రవేత్తలంటున్నారు. జన్యుపరంగా యిలాంటి లక్షణాలు సంక్రమిస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

మరో విషయమేమంటే కొందరు పిల్లలు కొన్ని పదార్థాలనే ఎంపిక చేసుకొని తింటారు. అలాకాకుండా అన్ని రకాల పదార్థాలను తినాల్సిన అవసరమున్నదని తల్లిదండ్రులు వారికి నచ్చజెప్పాలి. అసలు చిన్నతనం నుంచే అన్ని పదార్థాలనూ తినేలా జాగ్రత్త తీసుకొంటే పెద్దవారైన తరువాత వారితో ఎలాంటి పేచీ వుండదు. వారు తినని పదార్థాలను వారు యిష్టపడే రీతిలో వండటం వల్ల కూడా పిల్లలు ఆ వస్తువుల పట్ల విముఖతని తొలగించుకుంటారు. కాబట్టి పిల్లలు యిష్టపడే రీతిలో వంటలను మార్చిమార్చి వండుతారు కదూ! ☆

'సంశయం'

ఒక ఆవుదూడ అర్ధరాత్రి చేలో గడ్డి మేస్తోంది. దాని దగ్గరికో గుర్రమొచ్చి..

'ఇంత రాత్రి వేళ వచ్చావేం. పగలు మేయడం లేదా' అని అడిగింది.

'మేస్తున్నాను. కాని గడ్డిదొరికితే కదా కడుపు నిండేది. నేను పెద్ద పశువుల్లో కలిసి మేయాల్సి ఉంటుంది. కాస్త మంచి మేత దొరికి తినే సమయానికి పెద్ద పశువు వచ్చి నన్ను తరుముతోంది. నేను వాటికి దూరంగా దొరికింది తినాలి. పెద్దవన్నీ కడుపు నింపుకున్నాకే మాలాంటి చిన్న పశువులకు ఇంత గడ్డి దొరికేది. ఈరోజు బీట్లో గడ్డిలేక కడుపు నిండలేదు. నిద్రపట్టడం లేదు. ఆకలేసినప్పుడల్లా ఇలా రాత్రి వేళొచ్చి ఈ చేలో మేస్తుంటాను.' అంది దూడ. వెంటనే...

'అవునూ నువ్వు నాలా చిన్నదానివి కాదు కదా. మరి నువ్వెందుకు రాత్రి వేళల్లో వచ్చి మేస్తున్నావ్' అని అడిగింది గుర్రాన్ని.

'నా గోస ఏం చెప్పమంటావ్! నా యజమానికో గుర్రపుబండి ఉంది. దాంతో కిరాయిలు నడుపుతుంటాడు. పగలంతా ఆ బండి లాగాల్సిందే. కాస్తంత విశ్రాంతి కూడా దొరకదు. ఎప్పుడన్నా కిరాయిలు లేకపోతే కొద్దిగా ఉపశమనం. అప్పుడే కాస్త పచ్చగడ్డి తింటాను. తినేప్పుడే కిరాయి దొరికిందనుకో..నా నోటి ముందటి గడ్డిలాగేసి మరి నన్ను బండికి కట్టేస్తాడు. పోనీ సాయంత్రమన్నా ఆ వచ్చిన దబ్బుతో నాకు దాణా పెడతాడా అంటే అదీ లేదు. తాగుడుకు, వాడి అరడజను మంది పిల్లల కోసమే ఖర్చుపెడ్తాడు. రాత్రిపూట ఇలా చేలల్లోకి వదిలేసి తెల్లవారుఝామున వచ్చి తోలుకుపోతుంటాడు. చేను యజమాని చూస్తే నా వీపు పగిలినట్టే. కాని ఏం చేస్తాను. ఆకలి గదా. భయంతో అలాగే మేస్తున్నాను' అని తన కథ వినిపించింది గుర్రం.

'బాగున్నాయి మీ బాధలు. మా పక్షులకే అనుకుంటే మీకక్కాడా మొదలయ్యాయా' అంది జొన్న కంకిని పొడుచుకు తింటున్న పాలపిట్ట.

'మీకేంటమ్మా స్వేచ్ఛా విహంగాలు. ఎక్కడికైనా వెళ్తారు, ఏదైనా తింటారు. మీరెవరికీ సేవకులు కాదు. అలాంటిది మీరిలా అర్ధరాత్రి దొంగతనంగా తినడమెందుకో' అంది గుర్రం గడ్డి తింటూనే.

'నీవు చెప్పిందంతా గతం. ఇప్పుడు మాకు కష్టాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల మా పక్షులకు గాలిపడటం లేదు. కొన్ని చెరువుల్లో నీళ్ళు తాగితే చచ్చిపోతున్నాం. ఇదిలా ఉంటే లేచింది మొదలు ఎక్కడ ఆహారం తినాలన్నా భయమే. ఏ గింజల మీద ఏ వల ఉందో, దేని వెనక వేటగాడు ఉన్నాడోనని ఒకటే భయం. మమ్మల్ని బాణాలతో, తుపాకులతో వేటాడి చంపుతున్నారు. ఈ మనుషులకు ఎక్కడి ఆహారమూ సరిపోవడం లేదు. అనుక్షణం ప్రాణభయంతో బతకాల్సి వస్తోంది. అందుకే పగలు ఎవరికంటా పడకుండా దూరంగా వెళ్ళిపోయి రాత్రి వేళ ఇలా చేనుమీద పడి తింటున్నాము' అంది పాలపిట్ట.

'మనుషులే కాదు జంతువులు, పక్షులు కూడా స్వేచ్ఛగా బతకలేకపోతున్నాయి. మరి స్వాతంత్ర్యం ఎవరికొచ్చినట్లు' అనుకుంటూ గడ్డిమీద వాలిన మిడతను నోట్లో వేసుకొని కంపలోకి దూకిందో ఉసరవెల్లి..

-పుప్పాల కృష్ణమూర్తి



ఏమిటా సంఖ్యలు ?

నేస్తాలూ,

ఈ వారం మీకు ఓ గణితం ఫజిల్. మూడు అంకెలు ఉన్నాయి. అందులో మొదటి అంకె 3. రెండవ అంకె కావాలంటే మొదటి అంకెకు మూడవ అంకెలో 1/4వ వంతు కలపాలి. మూడవ అంకె మొదటి, రెండు అంకెల మొత్తానికి సమానం. ఇప్పుడు ఆ అంకెలేమిటో కనుక్కోండి ?

జవాబు

మొదటి అంకె = 3

రెండవ అంకె = 5 = 3 (మొదటి అంకె) + 2 (మూడవ అంకెలో 1/4వ వంతు)

మూడవ అంకె = 8 = మొదటి అంకె-3 + రెండవ అంకె-5 (మొత్తం)

చిరునామా

బాలనేస్తాలు, కేరాఫ్ సండేసెక్షన్, ప్రజాశక్తి దినపత్రిక కార్యాలయం, డో.నెం : 1-1-298/4, స్ట్రీట్ నెం : 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20

కలంస్నేహం

పేరు : కూరెళ్ళ లింగాచారి

వయస్సు : 11

చదువు : 6వ తరగతి

హాబీలు : క్రికెట్ ఆడటం, టీవీ చూడటం.

పూర్తి చిరునామా : కేరాఫ్ మైత్రి విద్యాలయం, గ్రామం : వెల్లంకి, మండలం : రామన్నపేట, జిల్లా : నల్లగొండ.

పేరు : ఎం. కిరణ్

వయస్సు : 13

చదువు : 9వ తరగతి

హాబీలు : క్రికెట్, వాలీబాల్ ఆడటం

పూర్తి చిరునామా : కేరాఫ్ శ్రీ రామా విద్యాలయం, గ్రామం : బయ్యారం, మండలం : బయ్యారం, జిల్లా : ఖమ్మం

పేరు : డి. శ్రీధర్

వయస్సు : 13

చదువు : 8వ తరగతి

హాబీలు : షటిల్ ఆడటం, కథలు చదవడం

పూర్తి చిరునామా : సన్నాఫ్ డి. సాంబశివరావు, ఇ.నెం : 12-97, అద్దంకి రోడ్, మండలం, పోస్టు : దరిశి, ప్రకాశం జిల్లా-523 247.

మాటలకోట - 31

1	✿	2		3		4	5	✿	6
	✿		✿		✿	7		✿	
8	9	✿	10		✿		✿	11	
✿		✿		✿	12	✿	13		✿
14		15	✿	16			✿	17	
	✿		✿		✿	✿	18		✿
	✿	19	20	✿	✿	✿		✿	21
22	23	✿	24		✿	25		✿	
✿	26	27	✿	✿	28		✿	29	
30	✿	31		✿	32			✿	✿

అడ్డం

2. '.....వినురవేమ'...(6)
7. అక్షి (2)
8. ఈ ప్రపంచం పిలిచిందని శ్రీశ్రీ అన్నారు (2)
10. యుద్ధం (2)
11. సుఖానికి వ్యతిరేకం (2)
13. మైదానం రచయిత (2)
14. కొందరు వావును చూసి ఇదనుకొంటుంటారు (3)
16. పథకం కాదు..ప్రతిభను గుర్తించి ఇచ్చేది (3)
17. పాము (2)
18. గర్వంలాంటిదే (2)
19. నాలుక చేసే పని (2)
22. ప్రథమం కోల్పోయిన కపోతం (2)
24. ముగ్గురు (2)
25. అలవెన్స్ తెలుగులో (2)
26. ఇది లేకుండా వచ్చేవాడే అతిథి (2)
28. అటు నుండి ఓ టిఫిన్ (2)
29. పాడటం (2)
30. మంచు (1)
31. దీన్ని ముట్టుకుంటే కాలుతుంది (2)
32. '.....బ్రహ్మ' (3)

నిలువు

1. మొదటి (3)
2. అద్దం 2లోని ప్రపంచం (2)
3. ఘోరం (3)
4. తడబడ్డ కలరా (3)
5. మట్టి (2)
6. అశుభం (3)
9. వెంట్రుకలు (3)
10. సాంబారు తోడిది (2)
11. పెన్ ఫ్రెండ్‌షిప్ (4)
12. ఒక చెట్టు. స్విమ్మింగ్‌లో ఉంటుంది (2)
14. బడికి పొమ్మని ఆదేశించండి (4)
15. ఇది తొందరగా షికారు చేస్తుంది (3)
16. గ్రామం (2)
18. అబద్ధం (3)
20. 'చిత్రం'లో ఓ గాయని (2)
21. ఎగిరేవాహనం (3)
23. పోస్టు (2)
25. బిల్డింగ్ (3)
27. గుప్తధనం...తిరగబడింది (2)
28. కిందినుండి ఆడ(2)

గతవారం జవాబులు : అడ్డం : 1. కరుణ 3. ఆకసం 6. తపస్సు 7. దస్తీ 8. ఆవు 10. తోటమాలి 12. ఆగు 14. లోకులు 16. తగువు 18. ఊడిగం 21. వైరు 22. మాత్ర 24. చిగో 25. బేరం 26. గాజా 27. వ్యాధి

నిలువు : 2. రుజువు 3. ఆప 4. కస్సు 5. దోస్తీ 6. తగ్గుట 7. దపఆ 8. ఆదిలోనే 10. తోలు 11. మామూళ్ళు 13. గురువు 15. పీత 17. గుడ్ 18. ఊరు 19. గంగిగోవు 20. కామా 21. వైటుగా 23. కరంతో

చిన్నారి చిత్రకారులు



కపిల్,
9వ
తరగతి,
కాకినాడ.

వి. రమేష్ రెడ్డి,
కంతేరు,
తాటికొండ
మండలం,
గుంటూరు జిల్లా.



జి. హరీష్, 5వ తరగతి
శ్రీకాకుళం

**ఆర్. కృష్ణ
కుమారి,**
10వ
తరగతి
అరవింద
హైస్కూల్
కాంచన
పల్లి

అభిప్రాయం తెలపండి

బాలలూ, మీరు పంపుతున్న పలు బొమ్మలు, ఇతర రచనలు అందుతున్నాయి. వాటిని ప్రాధాన్యతాక్రమంలో ప్రచురిస్తాం..అయితే బాలల పేజీల్లో మీకు ఏవి నచ్చుతున్నాయో, ఏవి నచ్చడం లేదో లెటర్ ద్వారా తెలియచేయండి. మీ అభిప్రాయాలను వీలునుబట్టి ప్రచురిస్తాం. ఇంకా బాలనేస్తాల పేజీలో ఏఏ అంశాలో ఇవ్వాలనుకుంటున్నారో సూచించండి. చిన్నారి చిత్రకారులకు బొమ్మలు పంపేవారు రంగులు వేయవద్దు. అలాగే కలంస్నేహం శీర్షికకు తమ అడ్రస్ పంపేవారు ఫొటో కూడా పంపాలి.

-ఎడిటర్

బాలనేస్తాలు

బాలభాష

మాకు ఉగ్రవాదం తెలియదు
మాకు అగ్రవాదం తెలియదు
మేం పిల్లలం...పసిపిల్లలం...

అమ్మ లాలనలో
నాన్న పాలనలో
అమాయకంగా, ఆనందంగా
ఆడుకునే మల్లెలం..

కొండలు, కోనలు
మేం నడయాడే వనాలు
నదీ నదాలు
మేం విహరించే రమణీయాలు

ఉదయాస్తమాలు
ఉజ్వల తారలు
ప్రకృతి దృశ్యాలు
పవిత్ర వరాలు

కాని రాత్రింబవళ్ళు
బాంబులు కురిపిస్తున్నారెవరో
సర్వనాశనానికి సమకట్టారేమో వాళ్ళు
పాపం పుణ్యం తెలియని
పిల్లలం...పసి పిల్లలం...

పాలకు దూరం
ప్రశాంతతకు భాగ్యం
భద్రతకు భారం
భయానికి సన్నిహితం

మృత్యువుకు నిత్యకబళంగా
మృత్తికలో మృత్తికగా
మరుభూమిగా మారుతున్నాం

ఎలుకను పట్టడానికి
కొండను తవ్వాలా ?
తల్లి చేసిన నేరానికి
పిల్లని దండించాలా ?

ఉగ్రవాదం తెలియదు
అగ్రవాదం తెలియదు
యుద్ధోన్మాదం తెలియదు
కల్లాకపటం ఎరగని మల్లెలం

నందనవనాల్ని నాగసాకీలు చేయకండి
మానస సరోవరాల్ని మరుభూములుగా మార్చకండి

-మాల్యశ్రీ

డబ్బు డబ్బు డబ్బు

గ్రీన్‌కార్డ్‌నం-యు.యస్-వెబ్-001

రుక్మిణి

చిట్టిబాబు కుతూహలంగానే ఇంటర్నెట్‌లో వెబ్‌సైట్ ఓపెన్ చేశాడు. ఏమేం మీటలు నొక్కాడో - ఏం గెలికాడో తెలవదు గానీ అక్కడ మాత్రం అల్లావుద్దీన్ అద్భుత దీపంలా ఓ నడికారు మనిషి వడివడిగా మాటలకు తగులుకున్నాడు. మధ్య మధ్యలో వచ్చీరాని వెక్కిళ్ళు వెక్కుతూ తన గోడునంతా వెళ్ళబోసుకుంటున్నాడు - చూస్తే బాగానే జాలివేస్తుంది. ఆ మనిషి మొహం పాలిపోయి జుత్తంతా మొహం మీద వాలిపోయి నీరు లేక ఎండిన వరి నారులా... కండ్లేమో లోతుకు పీక్కుపోయి బాగా తడిసిన నారుమడిలా మిటుకూ మిటుకూ చూస్తున్నాడు.

..... యన్-వెంకట్ పిలేట్... మాన్‌హట్టన్... అట్లా అంటే మీకర్థమై చావదు - కారణం నేను కేవలం తెలుగువాడ్ని కాబట్టే! ఆంధ్రాప్రదేస్ ఈజ్ మై జన్మభూమీ.. యా.. యా... పసుపులేటి వెంకటనారాయణ... అమెరికన్ యన్నారై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్! సెటిల్డ్... అయ్యో.... నాకిక్కడ గ్రీన్‌కార్డ్... యా... య్యా... అయాం గ్రీన్‌కార్డ్... కార్డ్.. టెలుగు మై మదర్ టంగ్... టంగ్...!

అపుడే చీర కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చిన సత్యభామ ఒక్కసారే రెచ్చిపోయింది. "నీ మొహం కాల్చినట్లే వుంది... నంగిరిలా ఏడుపులేంటి పెద్దయ్యా... ఆ ఏడుపేదో అచ్చతెలుగులో ఏడవ్వచ్చుగా"! భగ్గుమని భామ మండి పగడంతో 'పిలేటు' చాలా గాభరా పడి అదిరిపోయాడు!

"అయ్యో... అక్కయ్యా... సారీ... మైసిస్టర్... అక్కయ్యా.. పొరపాటై పోయింది.. అసలీ ఇంగ్లీషు ఇక్కడి వాళ్ళతో కలిసి మిడకడానికి అక్కడ మూడ్నెళ్ళు స్పోకెనింగ్లీషు ప్రాక్టీసు చేశా!" అతను బేరుమనడంతో భామకు కలుక్కుమని మరీ రెచ్చిపోయింది - వీడునాకు చిన్నాన్నో... పెదనాన్నలానో తగలడి 'అక్కయ్యా' అంటాడేంటి? అది అక్కడి అనాచారమా? మనసులోనే తిట్టుకుని కూలబడింది. చిట్టిబాబు లొట్టలు వేస్తూ వాడి వంక ప్రీతిగా చూస్తున్నాడు. యూన్నారై గదా! "అద్సరేగానబ్బాయ్... అక్కడ అమెరికాలో మీకెట్లా గడిచి పోతుందీ?" భామ ఒక్కసారే చిట్టిబాబు డొక్కలో మోచేత్తో పొడిచింది - వయసూ... వావివరసలు చూసుకోన క్కర్లేదా? చిట్టిబాబు 'కుయ్యి'మని మూలిగి ఊరుకున్నాడు.

.. అయ్యో భగవంతుడా! సెప్టెంబరు 11 తర్వాత నా గాలి మేడలన్నీ ఆ రెండు టవర్లలోనే అతలాకుతలమై పోయినాయి గదా! డాలర్ల యావలో... కార్ల షికార్లలో... వీకెండ్ పార్టీలూ... బార్లూ... రెస్టారెంట్లూ... డాన్సులూ.. లైట్లూ... నైటు క్లబ్బులు.. నగ్న నృత్యాలు.. స్వర్గం అంటే మరెక్కడోలేదూ... అమెరికానే 'స్వర్గం' కన్నా సవాలక్ష రెట్లెక్కువా అని బతికిన నా కలలన్నీ కుప్పకూలిపోయాయి గదా!"

"ఏం మాయదారి రోగం? ఆబగా అమెరికా వెర్రిలోపడి అక్కడి ఆలోచనలన్నీ ఒంటినిండా పట్టించుకుంటివి గదా...

"అమ్మా... ఇంకా కుళ్ళబొడవకండి! అసలీ అమెరికా... దాని ప్రజానీకం వాళ్ళ ఆలోచనల్లో.. వాళ్ళు ఎవడ్ని తన్నినా... చావబాదినా... నిప్పులో ఉప్పు పాతరేసే అధికారం దానికే వుందనుకున్నానా (రా)! అసలిక్కడ ఏం చేసినా, ఎట్లా చేసినా అదే 'స్వేచ్ఛ' - మాదే 'హక్కు' అనుకుంటిమిగదా... ప్రపంచాని కంతటికీ పుట్టుకతోనే రాజకిరీటం... డాలూ కరవాలం ఈ చేత్తో దర్జాగా... సింహాసనం చేత బట్టుకుని పుట్టిన వాళ్ళ మనుకున్న వాళ్ళ పుట్టి మునిగి ఉట్టెక్కినంత పనయింది గదరా దేవుడా!"

"ఏడవకేడవకు! అక్కడి వాళ్ళ సంగతి సరేసరి! మరి నీకేమయింది?" ఆబగా దొరికింది బొక్కి దుక్కముక్కలా తయారయినావుగదా!" భామ కడు అక్కసుగా అంది. చిట్టిబాబేమో అతని మెలిదిరిగిన కండల వంక అబ్బురంగా, చోద్యంగా చూస్తున్నాడు.

"అయ్యో! అసలు తమ తోలుకాని వాని తోలు వలచడానికి ఇపుడిక్కడంతా తయారై పోతున్నారు - గెడ్డం కనబడితే భయం... కొరకొర చూపులు.. తలపాగా సంగతి సరేసరి! దొంగలా తిరగవలసి వస్తుంది గదా! ఎక్కడకు పోవాలన్నా భయం... భయం... అంతటా అనుమానం.. అవమానం! పైగా మాకో కొత్త చిక్కొచ్చి పడింది గదా!"

"అన్ని దేశాల చిక్కుల్నీ మడతేసి మెలితిప్పే తంపల మారి అమెరికా వాళ్ళకి మళ్ళా చిక్కులేమిటబ్బా!" బహుసుతారంగా కాళ్ళూపుతూ అంది భామ.

"అదేనమ్మా.. అదే... మన దేశంలోని మానవ వనరుల మంత్రిత్వశాఖ వాళ్ళు తెచ్చి పెట్టిన మహాప్రసాదం! అయ్యో... మందేశంలోని యూనివర్సిటీల్లో జ్యోతిషం... సాముద్రికం.. భవిష్యద్దర్శనం... రాశి ఫలాలు... వాస్తు... పీస్తూ... పీ.జీ.కోర్సు అని అరాచకానికి అక్కడ 'మన' కాషాయదళం తగులుకున్నారు గదా!" అతను బొటబొట కన్నీళ్ళు కార్చడంతో భామకు బహు జాలివేసింది!

"మొన్న వస్తాదుల్లాంటి నలుగురు అమెరికన్లు మా ఇంటి తలుపు తట్టి "అరె... యా.... మీ ఇండియన్స్ అటు వెయ్యి సంవత్సరాలు... ఇటు వెయ్యి సంవత్సరాల భూత-భవిష్యత్‌లు చెప్పే సైన్సోటి తయారు చేసినారట గదా! మరి మా కీర్తి పతాకం ఆ టవర్స్ అట్లా కాలి కూలిపోతాయని ముందే ఎందుకు చెప్పి చావలేదూ?" అని ఒకటే దభాయింపు! నేను నోరు వెళ్ళబెట్టే సరికి మరోడు "అసలు మీ వాస్తుశాస్త్రం అంత గట్టిదైనపుడు మరి మీ ప్రధాని మాకు 'సిట్‌స్టాండ్' మొద్దబ్బాయి గదా... వాటిలోని వాస్తు లెక్కలు గట్టి - సరి చేసి ప్లాను మార్చి ఏడవ్వచ్చుగదా!" అని నా మూతిమీద ముష్టిఘాతం తగిలించబోయాడు. ఓరి దేవుడా! ఇదెక్కడి పీకులాటరా అని నేను తేరుకునేలోగా మరొహరు రెండు చేతులూ ముందుకు జాపి "ఆ ద్రోహి బిన్‌లాడెన్ ఏ సొరంగం పొక్కలో జొరబడి దాక్కున్నాడో చెప్తావా... చేతులు నరికెయ్యమంటావా?" అని హడలగొట్టాడు.

భామ నవ్వాపుకోలేక విరగబడినవ్వింది. చిట్టిబాబు మాత్రం బుద్ధిమంతుడిలా కుర్చీలో బాసింపీటేసుకుని అయోమయంగా తలాడిస్తూ వింటున్నాడు.

"నాకు రెండు రోజులు గడువిచ్చారు - నేనెక్కడని చచ్చేది? ఆ ఆఫ్ఘనిస్తాన్‌లో ఎడారి.. గుట్టల ఎత్తు పల్లాలు.. నాకేం తెలుసు? సొరంగాల మాట దేవుడెరుగు... ఈ విమానాలతో బాంబుల వర్షం కురిపిస్తున్నారు గదా..." అక్కడి అమాయక పేద జనాలు మాత్రం ఖచ్చితంగా 'ఖతం' అయి పోతారు... అంతవరకు మాత్రం నేను గ్యారంటీగా 'జోస్యం' చెప్పగలను - అని అన్నానో లేదో వాళ్ళు నా మీద నిలబడి కొట్టినంత పన్జేసి పరమ చండాలంగా బూతులకు తగులుకుంటే - మరొకడు రెండు జేబుల్లో నుండి రెండు రివాల్వర్లు తీసి నా రెండు కణతలకూ నొక్కి పెట్టాడు."

"అరె... అట్లా బాంబులేయడానికి... మా పోతున్న పరువు నిలుపుకోడానికి మేం ఇంకా ఏం చెయ్యాలి? ఎన్ని దేశాలను ఉగ్రవాదుల లిస్టులో చేర్చి వాటిని మల మల మంటల్లో మాడ్చి పారేయాలి? ఎందర్ని 'నరబలి' తీసుకుంటే మా వ్యాపారులకు నష్టపడకుండా సజావుగా లాభాలొచ్చి పడతాయి...? ఇదో.. చేతులు చూస్తావో.. చిలకల్నడుగుతావో.. గ్రహ ఫలాల్ని లెక్కలు గడతావో.. సరిగ్గా రెండ్రోజుల్లో చెప్పకపోతే నీ తోలు వలవడం ఖాయం" అని రుసరుసా వెళ్ళిపోయారు. నాకేం తోచడం లేదు.. అక్కయ్యా... సారీ... సారీ... సిస్టర్... ఒక రోజు అపుడే గడిచిపోయింది. నేను భయంతో హడలి చస్తున్నాను... ఈ కాషాయదళం నా కొంపమీదికి ముళ్ళ కంపను తెచ్చిపెట్టింది గదా... హా విహెచ్‌పీ... హెచ్‌అయ్‌వీ...

భామ టకీమని స్విచ్ ఆఫ్ చేసింది - చిట్టిబాబు నోరెళ్ళబెట్టి చీదరగా చూశాడు. "అరె.. అతనంతగా హడలి పోతున్నాడు గదా... పాపం... ఏదో ఒక మంచి సలహా చెప్పొచ్చు గద భామా"! అని గురగురమని గొణిగాడు.

"చిట్టిబాబూ... అమెరికా ప్రస్తుతం ఎవరిమాటా వినిపించుకునే దశలో లేదు - బుష్‌గారి వటాటోపం.. అహంకారం... ప్రపంచంలోని శాంతికాముకులందరూ ఉవ్వెత్తున లేచిపడినపుడే అణుగుతుంది. పాపం... సందు దొరికించుకుని ప్రపంచం నిండా ఉగ్రవాదాన్ని రేపే అత్యుగ్రదేశం అదేనాయె!" భామ కడు విచారంగా అంది.

"అద్సరేనే.. ఆ జ్యోతిష్యం... వాస్తు గురించైనా చెప్పొచ్చు గదనే!"

"ఏడ్చినట్లుంది. చిట్టిబాబూ... కాశ్మీర్ అసెంబ్లీ మీద దాడి జరిగే విషయం ఈ గ్రహాలు కనిపెట్టి చెప్పగలిగాయా! ఇంతెందుకూ.. రేపు ఇటు గుజరాత్... అటు ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో ఈ కాషాయ కూటమి అడుగు ఊడి ఎంతలోతులోకి దిగబడి పోతుందో... 'కనీసం అదైనా తమ జ్యోతిషశాస్త్రాన్ననుసరించి వీళ్ళు చెప్పగలరా?"

చిట్టిబాబు మిడిగుడ్లేసుకుని చూశాడు! ★

లక్ష్మి

నవ్వుల క్లబ్బుల గురించి మీరు వినే వుంటారు. ఉదయం సాయింత్రం మైదానాల్లో నిలబడి - పకపకా నవ్వడం పగలబడినవ్వడం విరగబడి నవ్వడం లాటి విన్యాసాలతో ఈ సభ్యులు బిజీగా వుంటారు. అకారణంగా నవ్వేట్లా వస్తుందో నాకు తెలీదు. నవ్వురాకపోయినా నవ్వాలి. అట్లా కొంతసేపు నవ్వేస్తే ఆరోగ్యం ఆనందదాయకంగా వుంటుందని శాస్త్రం చెబుతోంది. తద్వారా ఎక్కువ కాలం బతికే ఛాన్సు కూడా వుంటుందిట. నవ్వు ప్రాణవాయువు లాటిదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మరో పక్క ఆడపిల్ల నవ్వకూడదని మగవాడు రూలు పెట్టేడు. ఆడపిల్ల నవ్వితే కొంపమునుగుతుందని భయపెడుతున్నాడు. నమ్మకం లేకపోతే భారతం చదవమని సలహా యిస్తున్నాడు. మయసభలో దుర్యోధనుడు - అది ఇదనుకుని, ఇదే అదనుకుని - గంతులేస్తూ రంకెలేస్తుంటే ద్రౌపది పకపకా నవ్వేసిందిట. ఆ నవ్వే మహాభారత సంగ్రామానికి దారి తీసిందిట. ఆ యుద్ధంలో వారూవీరూ - బాణాలేసుకుని కత్తులు దూసుకోవడంతో - రణరంగం ఒక పెద్ద శ్మశాన వాటికగా మారిపోయిందిట. అంచేత ఆడవాళ్లు నవ్వకూడదని కోప్పడుతున్నారు!

ఇదేం చోద్యం? హాయిగా నవ్వుకునే హక్కు - కాకమ్మ కథలు చెప్పి - ఆడవాళ్లకు లేకుండా చేయడం న్యాయమా? ఏమైనా అంటే అన్నావంటారు. నవ్వే ఆడమనిషినీ, ఏడ్చే మగవాడినీ నమ్మకూడదని కూడా సెలవిస్తుంటారు. ఇల్లాంటి పరిస్థితుల్లో ఆడవాళ్లు విరివిగా నవ్వుల క్లబ్బుల్లో సభ్యులయ్యే అవకాశం ఏముంటుంది? ఆడవాళ్లు అస్తమానూ ఏడుస్తూనూ, మగవాళ్లు అనుక్షణం నవ్వేసుకుంటూను కాలం గడపాలనే దురుద్దేశంతో - ఈ దిక్కుమాలిన రూలుని మగవాడే పెట్టేడు. అతని రాతకోతల్లో ఆడది బొత్తిగా హింసింపబడుతూ వస్తోంది! ఇది నిన్నా మొన్నటి విషయం కాదు. అనాదిగా ఈ తంతు ఇట్లా జరుగుతూనే వుంది. నవ్వనేది అందరికీ వర్తిస్తుంది. నవ్వడం తప్పయితే మగవాళ్లు కూడా నవ్వకూడదు. మగవాడు మాత్రమే నవ్వేసుకుంటో - ఆడవాళ్లు నవ్వకూడదని నీతిసూత్రాలు చెప్పడం దుర్మార్గం. నవ్వొక్కటే కాదు. అనేక విషయాల్లో ఆడజాతికి మగవాడు సంకెళ్లు వేసి వుంచేడు. తద్వారా ఆమెను ఒక ఆటవస్తువుగా మార్చుకున్నాడు!

పురాణకాలంలో కూడా ఆడవాళ్ల కథ యిట్లాగే నడిచింది. ఒకాయన వాళ్లావిడ్ని జూదంలో ఓడిపోయేడు. మరొక పెద్దమనిషి ఎవడికో బాకీపడి - ఆ బాకీ తీర్చుకునేందుకు భార్యని నడిబజార్లో అమ్మేసేడు. ఎవడో



ఏదో కూస్తే - ఆ కూతలకి భయపడి అర్ధాంగిని అడవికి పంపిన ప్రబుద్ధులూ వున్నారు. కుష్టురోగంతో బుట్టలో కూచుని భార్య నెత్తినెక్కి వేశ్య యింటికి వెళ్లిన పొగరుబోతులూ వున్నారు. ఈ కథలన్నీ మగాడే చెప్పేడు. అక్షర సత్యమో అభూతకల్పనో అనవసరం. ఆడవాళ్లని వెన్నెముక లేని జీవులుగా చిత్రీకరించి తృప్తిపడ్డాడు. పతిదేవుడు తప్పుడు పనులు రెచ్చిపోయి చేస్తున్నా - తప్పుకదా మగడా అని ఏ ఆడకూతురూ నోరెత్తి అడగలేదు. కడవల కొద్దీ కన్నీరు కార్చడమే తమ వంతు కార్యక్రమంగా పెట్టుకున్నారు. అంచేతనే ఆడది ఏడుస్తూ బతకాలనే రూలు పెట్టేరని నాకో డవుటు!

నిజానికి ఆడపిల్ల నవ్వులో ఎంతో అందముంది. ఆమె నవ్వులో ఒక వెన్నెలుంది. ఒక హాయి వుంది. ఒక తియ్యదనముంది. ఆమె నవ్వుతే మనసు పరవశిస్తుంది. మగవాళ్ల నవ్వుల్లో ఈ లక్షణాలు కాగడా పెట్టి వెతికినా కనిపించవు. వాళ్లు నవ్వితే బావురుకప్ప ఏడుస్తున్నట్టు వుంటుంది. వాళ్లు నవ్వితే పులి సకిలించినట్టు వుంటుంది. ఉరుము ఉరిమినట్టు వుంటుంది. ఈ ధ్వనులు జ్ఞాపకానికొచ్చి - తమ నవ్వుకి మార్కెట్టు వుండదని గ్రహించి - ఆడవాళ్ల అందమైన నవ్వుకి సంకెళ్లు వేసేరు! ఏడుస్తూ కూచోండి మాకేం అభ్యంతరం లేదని - ఏడ్వడానికి అనుమతిచ్చేరు! నవ్వొస్తే దాచుకోమన్నారు. ఎప్పుడేడ్చినా తప్పు లేదని బుజ్జగిస్తున్నారు. ఎక్కడో చదివేను. ఏడ్వడం కూడా ఆరోగ్యానికి మంచిదేనట! మంచి టానిక్కుట! గుండెల్లో గూడు కట్టుకున్న బరువు తేలిక పడాలనుకుంటే గట్టిగా ఏడ్చేయాలిట! బరువెక్కిన గుండెకు ఏడుపు వల్ల ఉపశమనం కలుగుతుంది. తద్వారా బతికే కాలం కూడా పెరుగుతుంది. అంచేతనే ప్రతి చిన్న విషయానికీ వలవలా ఏడ్చేసే అతివలు - మగవాళ్ల కంటె ఎక్కువ కాలం బతుకుతున్నారని సర్వే చేసి తెలుసుకున్నారు!

ఈ నిజాన్ని గ్రహించి మగవాళ్లు సైతం నవ్వుకి చుక్కపెట్టి ఏడ్వడం ఎంత ప్రాక్టీసు చేస్తే అంతమంచిది. ఎవడో జేబు కొట్టేసినప్పుడు - దొంగాదొంగా అని అరవడం కంటె - గట్టిగా ఏడ్చేయడం బెటరు. తానెక్కవలసిన బస్సు మిస్సయినప్పుడూ... సినీమా టిక్కెట్టు దొరకనప్పుడూ విషాదంగా నవ్వేసే పద్ధతిని విడిచిపెట్టాలి. ఓపిక తెచ్చుకుని పెద్ద ఎత్తున శోకాలు తీయాలి. నిత్య జీవితంలో కొన్ని సుఖాలతో పాటు ఎన్నో కష్టాలు కూడా ఎదురవుతుంటాయి. కష్టాలొచ్చినప్పుడు కళ్లు చెమర్చడం సహజం. అక్కడ్తో మగవాడు ఆగిపోతున్నాడు. చెమర్చిన కళ్లను పక్కకి తిరిగి అలవోకగా తుడుచుకుంటున్నాడు. ఆ చర్యతో గుండె నిబ్బరం చేసుకున్నానని సరిపెట్టుకుంటున్నాడు. అది తప్పు. అక్కడే మగవాడు దెబ్బతింటున్నాడు. కన్నీటిని తుడుచుకోగలడేమోగానీ గుండెల్లో గూడు కట్టిన బాధని తొలిగించుకోలేడు. ఆ బాధ మరికొన్ని బాధల్తో కలిసి బరువెక్కువైనప్పుడు - గుప్పెడు గుండెకి తట్టుకునే శక్తి వుండదు. సడన్‌గా ఇంతే సంగతులని చెప్పేస్తుంది!

అంచేత బాధల బరువుని దాచుకోకుండా - ఎప్పటికప్పుడు ఘొల్లున ఏడ్చేయడం మంచిదని మగవాళ్లందరికీ సలహా యిస్తున్నాను. మమ్మల్ని చూసి ఆ విద్య నేర్చుకోమని మనవి చేస్తున్నాను. ఆఫీసుకి ఆలిస్యంగా వెళ్లినప్పుడు - పైవాడు ఏవో కుళ్లుమాటలంటాడు. ఆ మాటలు గునపాల్లాగా గుండెను తాకుతాయి. మగవాడు ఏడవకూడదనే రూలుని పాటించి - ఒక పొడి నవ్వు నవ్వేస్తే ఆ గునపం గుండెల్లో స్థిరనివాసమేర్పరుచుకుంటుంది. దాంతో మనిషి సగానికి సగం బరువు తగ్గిపోతాడు. ఈ దుస్థితిని దూరం చేసుకోవాలంటే - ఆ మగాడు ఘొల్లున ఏడవాలి. దీనివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. గుండెల్లో దిగిన గుణపం గొంతులోంచి బయటకొచ్చేస్తుంది - ఒకటి! మాటంటె ఓర్చుకోలేక ఆఫీసు టాపు లేపేసే స్థాయిలో ఏడుస్తాడనే బెంగతో పైవాడు నోరెత్తడు - రెండు! అంచేత మగాళ్లు నవ్వడంతోనే సరిపెట్టుకోకుండా - మా ఆడవాళ్ల మాదిరి శోకాలు తీయడం మంచిదని మగాళ్లకు మనవి చేసుకుంటున్నాను! నవ్వే హక్కు మగవాళ్లు మాకివ్వకపోయినా ఘొల్లున ఏడ్చే మాగుణాన్ని సొంతం చేసుకుని సుఖపడవలసిందిగా సలహా యిస్తున్నందుకు - నన్ను అభినందిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను! ☆

మనోహర శిల్పాల 'మహేశ్వరం'



మహేశ్వరంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం (శివగంగ)

భూపతి అంజన్‌కుమార్

భారతీయ సంస్కృతి మహోజ్వలంగా ప్రకాశించిన కాలంలో కళాపోషకులైన రాజులెందరో శిల్పకళను ఆదరించారు. రాజ్యాలు అంతరించినా నేటి నవయుగంలో కూడా వారు నిర్మించిన చారిత్రాత్మక కట్టడాలు వారి వైభవానికి చిహ్నంగా నేడు దర్శనమిస్తున్నాయి. అలాంటి రాజుల అభిరుచికి, శిల్పకళా వైభవానికి సజీవ సాక్ష్యం మహేశ్వరం గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవాలయం. ఇక్కడ కఠిన శిలలను సైతం కమనీయ శిల్పాలుగా మలచిన ఆనాటి శిల్పుల నైపుణ్యానికి అద్దం పట్టే కళాఖండాలు ఎన్నో వున్నాయి. ఇలాంటి అద్భుత దేవాలయం రాష్ట్రంలో ఎక్కడా లేదని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కళాఖండాలు శిథిలమైపోతున్నాయి. ఆలస్యంగానైనా రాష్ట్ర పర్యాటక మ్యాపులో ఇప్పుడిప్పుడే చోటు చేసుకున్న దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం 20 లక్షల రూపాయలు మంజూరు చేసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మహేశ్వరం గ్రామం నాలుగు శతాబ్దాల హైదరాబాద్ చరిత్రతో ముడిపడివుంది.

ఒకప్పుడు కళా ప్రదర్శనలకు, పండితుల చర్చా గోష్ఠులకు నిలయంగా మహేశ్వరం ఎంతో ప్రసిద్ధిగాంచింది. గోల్కొండ సామ్రాజ్యాన్ని పరిపాలించిన కుతుబ్‌షాహీ వంశస్థుల్లోని చివరి రాజు అబుల్ హసన్ తానీషా వద్ద ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రులుగా పని చేసిన అక్కన్న, మాదన్నల స్వగ్రామమైన మహేశ్వరానికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. రాష్ట్ర రాజధాని నగరానికి కేవలం 27 కిలో మీటర్ల దూరంలోని ఈ మహేశ్వరంలోని పురాతన కట్టడాలు కోనేరు, శివగంగ, ప్రార్థనా మందిరాలు సందర్శకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి. అక్కన్న, మాదన్నలకు ఇష్టదైవమైన శివుని పేరుతో ఇక్కడ అనేక మందిరాలు నిర్మించడం ద్వారా ఈ గ్రామం 'మహేశ్వరం'గా ప్రసిద్ధిగాంచినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కళా ప్రియులైన అక్కన్న మాదన్నలు తమ అభిరుచులకనుగుణంగా మహేశ్వరంను తీర్చిదిద్దుకొన్నారు. శత్రువర్గం ఈ గ్రామంపై దాడి జరిపితే గ్రామస్తులు తల దాచుకోవడానికి అనువుగా నిర్మించిన కోట 20 వేల చదరపు గజాల వైశాల్యం కలిగి ఉంది. స్థానికులు గడికోటగా పిలిచే ఈ కోటకు నాలుగు వైపులా ద్వారాలున్నాయి. తూర్పున వున్న రెండు విశాలమైన ద్వారాల ద్వారా అక్కన్న, మాదన్నల రాకపోకలు సాగుతూ వుండేవట. కోట లోపలికి వచ్చిన వారు దాహార్తి తీర్చుకోవడానికి నిర్మించిన బావి నేటికీ ఉంది. కోట లోపల నిర్మించిన నాట్యమందిరాలు, సమావేశపు మందిరాల రూపు రేఖలు చెదరకుండా వున్నాయి. చుట్టూ పచ్చని పొలాలతో ప్రకృతి సోయగాలను వెదజల్లుతూ అక్కడి జల దృశ్యమాలికలు కన్నుల పండుగగా ఉంటాయి. ఇక్కడ వున్న శివగంగ జలాశయాన్ని సందర్శకులు పవిత్రంగా భావిస్తారు. దీని నిర్మాణం వాస్తు నిపుణులను సైతం అబ్బుర పరుస్తుంది. 150 అడుగుల పొడవు, అంతే వెడల్పుతో ఒకేసారి వేయిమంది స్నానం చేసే విధంగా ఈ శివగంగను నిర్మించారు. పక్కనే మరో కోనేరులో అతిథులు ఉండేందుకు వీలుగా రెండంతస్తుల అద్దాల భవనం నిర్మించారు. ఇక్కడ దేవాలయాలు, కోట పూర్తిగా రాతితో నిర్మించడం విశేషం. ఇక్కడ కోదండ రామాలయం కూడా కళాత్మకంగా నిర్మించారు. ప్రధానంగా నలువైపులా పదహారు శివాలయాలు, నడుమ అందమైన నీటి కొలను వుంది. కొలను మధ్యలో నిర్మించిన శ్రీరాజరాజేశ్వరీ దేవాలయం ఎంతో మనోజ్ఞంగా వుంటుంది. దేవాలయం చేరుకోవడానికి పూర్తిగా నీటిలోనే అద్భుతమైన రాతి వంతెన నిర్మించటం సందర్శకులను మరింత విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మహేశ్వరం గ్రామం నుండి గోల్కొండ కోట వరకు సొరంగ మార్గం ఉండేదని చరిత్రకారులు చెబుతున్న దాని అవశేషాలు నేడు కనుమరుగయ్యాయి.. అక్కన్న మాదన్నలు గోల్కొండ నుండి మహేశ్వరం వరకు వచ్చిపోయిన రహదారి నేటికీ ఉంది. ఈ మార్గానికి ఇరువైపులా అక్కడక్కడ కళాత్మకమైన రాతి శిలలు ఏర్పాటు చేశారు. గుర్రాలు అలసిపోయినపుడు వారు ఇక్కడ మజిలీ చేసి మరలా గుర్రాలపై ప్రయాణించే వారని ప్రతీతి. ఈ మజిలీ ప్రాంతాలను నేడు చిన్న, పెద్ద గోల్కొండలుగా పిలుస్తున్నారు. కాగా కోట లోపల అత్యంత కళాత్మకంగా నిర్మించిన మసీదు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒకే చోట గుడి, మసీదు నిర్మించి శివరాత్రి, నమాజ్‌లు నిర్వహించిన చరిత్ర ఈ కోటకు ఉంది. ☆



అక్కన్న, మాదన్నలు నిర్మించిన దుర్గపు సింహద్వారం



జూనియర్లే ఆదర్శం

ఎం.డి.హసన్ షరీఫ్

అక్టోబర్ 21వ తేదీ, ఆదివారం!
ఆస్ట్రేలియాలోని హోబర్ట్ మైదానం!!
భారత్, అర్జెంటీనా మధ్య ఫైనల్స్ మ్యాచ్!!!

కప్ సాధించాలనే పట్టుదలతో భారత్. భారత్‌ను నిలువరించాలనే పట్టుదలతో అర్జెంటీనా. చివరికి భారత్ పట్టుదల ముందు అర్జెంటీనా చేతులెత్తేసింది. గత సంవత్సరం రన్నరప్‌గా నిలిచిన భారత్ ఏడవ జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చి 6-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించి ప్రపంచకప్ సొంతం చేసుకుంది.

చాలాకాలం తర్వాత భారత హాకీకి మళ్ళీ మంచిరోజులు వచ్చాయి. జాతీయ క్రీడ అయిన హాకీ రోజురోజుకు అథఃపాతాళానికి దిగజారుతోంటే అభిమానుల మనస్సు కలవరపడింది. ప్రజలు క్రికెట్‌పై అభిమానం పెంచుకుంటే క్రికెటర్లు డబ్బులకు అమ్ముడుపోయి అభిమానులనే మోసం చేశారు. దీంతో ప్రజలకు క్రీడల పట్లే విరక్తి కలిగింది. ఇదే సమయంలో హాకీ జూనియర్లు తమ సీనియర్లు సాధించలేని ఘనతను సాధించి అభిమానులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు. భారత హాకీ 1980లో మాస్కో ఒలింపిక్స్ తర్వాత 21 ఏళ్ళ పాటు గొప్ప విజయానికై మొహం వాచింది. చివరికి ఇప్పుడు ప్రపంచకప్‌తో జాతీయ క్రీడ పేరును క్రీడాకారులు సార్థకం చేశారు.

హ్యాట్రిక్ వీరుడు దీపక్ ఠాకూర్

లీగ్ మ్యాచ్‌లలో అద్భుత ప్రతిభ కనబర్చిన భారత్ ఫైనల్లో ఎదురులేని జట్టుగా నిలిచింది. అర్జెంటీనాను చిత్తుచేస్తూ ఏకంగా భారీ తేడాతో (6-1 గోల్స్) గెలుపొందడం విశేషం. దక్షిణఅమెరికా ఛాంపియన్ అయిన అర్జెంటీనాను చిత్తు చేయడం భారత యువకుల ప్రతిభకు నిదర్శనం. ముఖ్యంగా దీపక్ ఠాకూర్ సమయోచిత ఆటతీరును ప్రదర్శిస్తూ హ్యాట్రిక్ సాధించడం మరువలేని విషయం. భారత్ తొలి అర్ధభాగంలోనే 2-0 గోల్స్‌తో ఆధిక్యంలో ఉంది. రెండో అర్ధభాగం చివరి పది నిమిషాల్లో ఠాకూర్ విశ్వరూపాన్నే ప్రదర్శించాడు. 3-1 గోల్స్ ఆధిక్యంతో భారత్ గెలుపు అప్పటికే ఖరారైనా 53, 56, 59 నిమిషాల్లో వరుసగా గోల్స్ చేసిన ఠాకూర్ అర్జెంటీనాకు అందనంత దూరానికి భారత్‌ను తీసుకెళ్ళాడు. ఊపిరి ఆడని అర్జెంటీనా ఆటగాళ్ళు గెలుపుపై ఆశలు వదులుకోవడంతో భారత్ చిరస్మరణీయమైన విజయాన్ని సొంతం చేసుకుంది. లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో డ్రా చేసుకున్న భారత్ ఫైనల్లో విజృంభించడం విశేషం. భారత్ అద్వితీయ ప్రభతకు నిదర్శనమే ఫైనల్లో ఏకపక్ష విజయం. ఈ టోర్నీలో మొత్తం 10 గోల్స్ చేసిన ఠాకూర్ టోర్నీలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు.

పెరిగిన బాధ్యత

జూనియర్ ప్రవంచకప్ సాధించిన భారత్‌పై బాధ్యత మరింత పెరిగింది. జూనియర్లను ఆదర్శంగా తీసుకొని సీనియర్లు కూడా 2002లో జరిగే ప్రవంచ కప్ సాధించాలి. వచ్చే సంవత్సరం జరిగే ప్రవంచకప్‌కు ఇప్పటినుండే ప్రాక్టీసు ప్రారంభిస్తామని భారత హాకీ సమాఖ్య అధ్యక్షుడు కె.పి.ఎస్.గిల్ అన్నారు. జూనియర్ల గెలుపు సీనియర్లకు టానిక్‌లాగా పనిచేసిందని గిల్ వ్యాఖ్యల ద్వారానే తెలుస్తోంది. యూరప్‌కు చెందిన స్పెయిన్, హాలెండ్, జర్మనీ బలమైన జట్లను హోబార్ట్‌లో ఓడించిన భారత జూనియర్ ఆటగాళ్ళు సీనియర్ జట్టులో కూడా ముఖ్య భూమిక నిర్వహించగలరు. ఒక సంవత్సరం సమయం ఉన్నందున సీనియర్ ప్రపంచకప్ సాధించడం భారత్‌కు ఏమంత కష్టం కాదు.

అభివృద్ధికి ప్రభుత్వం నడుం బిగించాలి

జూనియర్లు ప్రపంచకప్ సాధించినప్పుడు సీనియర్లు కూడా సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే ఆటగాళ్ళకు భారత హాకీ సమాఖ్య, ప్రభుత్వం ఇప్పటినుండే ప్రణాళికాబద్ధ శిక్షణ ఇప్పిస్తేనే ఇది సాధ్యం. క్రికెట్‌కు ఇచ్చినంత ప్రోత్సాహం హాకీకి ఇవ్వడం లేదనే విమర్శ ఉంది. తాము 32 ఏళ్ళ తర్వాత 1998 ఆసియాడ్‌లో స్వర్ణ పతకంతో స్వదేశం వచ్చినప్పుడు విమానాశ్రయంలో స్వాగతం పలికే నాథుడే లేకపోవడంతో హాకీ మాంత్రికుడు ధనరాజ్ పిళ్ళై బాధపడ్డాడు. తన కొడుకును హాకీ క్రీడాకారుడిగా తయారు చేయబోనని ఆయన అప్పుడే శపథం చేశాడు. ఇప్పుడు ప్రపంచకప్ తెచ్చిన జూనియర్లకు భారీ ప్రోత్సాహకాలు ప్రకటిస్తేనే వారిలో ఉత్సాహం ఇనుమడిస్తుందని సీనియర్ జట్టు కెప్టెన్ ముఖేశ్ కుమార్ పిలుపునిచ్చాడు. జాతీయ క్రీడ అయిన హాకీ దు[illegible]కి ఈ రెండు ఉదాహరణలే నిదర్శనం. ప్రభుత్వం సవతితల్లి ప్రేమ విడనాడి హాకీ అభివృద్ధికి నడుంకట్టాలి. ఇకనైనా జగజ్జేతలుగా తిరిగివచ్చిన జూనియర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తే సీనియర్ విభాగంలో కూడా ప్రపంచకప్ సాధించడం భారత్‌కు నల్లేరుమీద నడకగా మారుతుంది. యువకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ శిక్షణకై అవసరమైన అన్ని వసతులూ సమకూర్చాలి. అప్పుడే సీనియర్ విభాగంలో కూడా ప్రపంచకప్‌పై ఆశలు పెట్టుకోగలుగుతాం. లేకుంటే హాకీ తన దుస్థితి నుండి పైకి ఎదిగే అవకాశమే లేదు. ☆

ప్రపంచ కప్ సాధించిన తీరు...

ప్రత్యర్థి	స్కోరు	ఫలితం
తొలిరౌండ్‌లో (గ్రూప్-సి)		
కెనడా	5-0	గెలుపు
స్కాట్లాండ్	7-1	గెలుపు
స్పెయిన్	3-0	గెలుపు
రెండో రౌండ్‌లో (గ్రూప్-ఎఫ్)		
అర్జెంటీనా	2-2	డ్రా
ఆస్ట్రేలియా	1-2	ఓటమి
హాలెండ్	4-3	గెలుపు
సెమీఫైనల్లో		
జర్మనీ	3-2	గెలుపు
ఫైనల్లో		
అర్జెంటీనా	6-1	గెలుపు

జూనియర్ ప్రపంచకప్ గత విజేతలు

సం.	వేదిక	విజేత	రన్నరప్
1979	వెర్సాలిస్	పాకిస్తాన్	జర్మనీ
1982	కౌలాలంపూర్	జర్మనీ	ఆస్ట్రేలియా
1985	వాంకోవర్	జర్మనీ	హాలెండ్
1989	మలేసియా	జర్మనీ	ఆస్ట్రేలియా
1993	బార్సిలోనా	జర్మనీ	పాకిస్తాన్
1997	మిల్టన్ కీన్స్	ఆస్ట్రేలియా	భారత్
2001	హోబర్ట్	భారత్	అర్జెంటీనా

ఎక్కువ గోల్స్ చేసిన వీరులు

★ 10 గోల్స్ దీపక్ ఠాకూర్ (ఫార్వర్డ్) అన్నీ ఫీల్డ్ గోల్స్. టోర్నీలోనే అత్యధిక స్కోరర్.

★ 7 గోల్స్ జుగ్రాజ్ సింగ్ (డిఫెండర్) అన్నీ కార్నర్ గోల్స్. టోర్నీలోనే రెండవ అత్యధిక స్కోరర్.

★ 5 గోల్స్ ప్రభ్‌జ్యోత్ సింగ్ (ఫార్వర్డ్) అన్నీ ఫీల్డ్ గోల్స్.

మొలకలపల్లి కోటేశ్వరరావు

దశ తిరిగింది

"యాత్రలకి పోయి వచ్చినోళ్ళంతా బొంబాయీ, ఢిల్లీ చూసి వచ్చామంటారూ, ఏముండిద్ది? అక్కడా మనలాంటి మనుషులేనా, వాళ్ళకేమన్నా రెండు కొమ్ములుంటయ్యా? ఏందో యేలంయెర్రిగాకపోతే.." మంచానికి కోళ్ళు బిగిస్తూ అన్నాడు క్రిష్ణాచారి.

ఇంటిముందు వున్న గంగరావి చెట్టు క్రింద క్రిష్ణాచారి పని చేస్తుంటే, చుట్టూ నలుగురు రైతులూ, పనిలేని మరో ఇద్దరు వయసు మళ్ళిన వాళ్ళూ కూర్చుని వున్నారు.

పెద్ద నల్లతుమ్మ మొద్దు ఒకటి వుంటే, దాని మీద కూర్చుని నేను వాళ్ళ మాటలు వింటున్నాను.

"లేకపోతే ఏముండిద్ది అక్కడ? పెద్ద పెద్ద మిద్దెలూ, మేడలూ వుంటయ్యేమొ! అంతకంటే ఏం వుండబోయినయబ్బా?" అన్నాడు ఒక రైతు.

"కాశీ, రామేశ్వరం పోయి వచ్చామంటారా, అక్కడ మాత్రం కొత్తయ్యి ఏంవుంటయ్యి? గుళ్ళూ, గోపురాలూ వుంటయ్యేమో! మన వూళ్ళో మాత్రం గుళ్ళు లేవూ? కాకపోతే అక్కడ కాస్త పెద్దయ్యి వుంటయ్యేమొ! మన వూళ్ళో గుళ్ళు చూస్తే చాలదూ, అంతదూరం పోవాల్సిన పనేమొచ్చిందంట?" మళ్ళీ అన్నాడు క్రిష్ణాచారి.

"నిజమేనో... అక్కడ గుళ్ళు కాక ఇంకేముంటయ్యి? అక్కడ ఏమైనా దేముడు కనపడతాడూ? ఎక్కడా కనపడ్డు కదా! అంతదూరం ఎందుకంట పోయేది?" మరో రైతు అన్నాడు.

"తిరప్పతితిరపతి అంటారా? నా చిన్నప్పుడు మా నాయన తీసకపోతే యెనికీడితీ పోయాలే ఒకసారి! అక్కడ కూడా ఏం లేదూ! రైల్లో పోయిరాటం తప్ప చూసింది లేదూ, పెట్టింది లేదూ! ఒంగోల్లో రైలు మాత్రం చూసాలే! ఎక్కేగా! అంతకుమించి అక్కడ తిరపతిలో ఏం వుందీ, నా బొంద!"

"నిజమే కిట్టాచారీ... బొంబాయిలో ఏం లేదంటంటివీ, ఢిల్లీలో ఏం లేదంటంటివీ, కాశీలో ఏం లేదంటంటివీ, రామేశ్వరంలో, తిరుపతిలో ఎక్కడా ఏం లేదంటంటవి! మరి జనం అంతా ఎందుకు పోతున్నట్టాంట? జనానికి డబ్బులేమన్నా ఎక్కువయ్యి యాత్రలకి పోతన్నారూ?" క్రిష్ణచారి మాటలకి అడ్డుకట్ట వేస్తూ ఒక రైతు అడిగాడు.

"అదేనో... విచ్చి... ఎవురి పిచ్చివాళ్ళకానందం అంట! మొన్న మన వూళ్ళో చాలా మంది యాత్రలకి కాశీ, బొంబాయి పోయివచ్చారుగా? వాళ్ళను ఏం చూసారో చెప్పమను! నాలుగేలు వదిలిచ్చుకుని వచ్చారు తప్ప నాల్రూపాయలు ఆదాయం తెచ్చారూ? అంతాయెర్రే! యెర్రిమాలోకం తప్ప ఏ వూళ్ళో అయినా ఏం వుండిద్దంట? బొంబాయి, ఢిల్లీ పోయివచ్చినోళ్ళని రమ్మను నా ముందుకి... ఇక్కడ లేనియ్యా, అక్కడ వున్నయ్యా ఏం చూసి వచ్చారో తేలుస్తా!" ఛాలెంజ్ చేసినట్లుగా అన్నాడు క్రిష్ణాచారి.

అతని మాటలకి ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు.

క్రిష్ణాచారి నాకంటే ఒకటీ, రెండేళ్ళు పెద్ద వుంటాడు.

మాతోపాటు ఆరవ తరగతి వరకూ చదువుకున్నాడు. చదువు పెద్దగా రాకపోవటంతో స్వస్తి చెప్పి కులవృత్తిలో పడిపోయాడు.

వడ్రంగం పని చేస్తున్నాడు. చదువు అబ్బకపోయినా మాటలు మాత్రం బాగా అబ్బాయి. ఉత్త మాటల పుట్ట! తెలిసిన విషయాలూ, తెలియని విషయాలూ ఏమయినా సరే అనర్గళంగా గంటల తరబడి మాట్లాడుతుంటాడు.

మా ఇంటి ఎదురుగానే వాళ్ళ ఇల్లు కూడా!

ఇల్లు చిన్నది. మట్టి గోడలతో పెట్టిన పురాతన కాలం నాటి పెంకుటిల్లు అయినా ఇంటి ముందు విశాలమైన స్థలం వుంది.

ఆస్థలంలో పెద్ద పెద్ద కొమ్మలతో గంగరావి చెట్టు! అది ఎప్పుడో వాళ్ళ తాతల నాటి (న) చెట్టు! నా చిన్నతనం నుంచి అలాగే పెద్దపెద్ద కొమ్మలతో విస్తరించి వుంది! ఆహ్లాదకరంగా వుంటుంది అక్కడ!

చెట్టు క్రింద చల్లని నీడ వుండటం, క్రిష్ణాచారి చెట్టు కిందనే పని చేస్తూ వుండటంతో కాలక్షేపంగా అక్కడ చాలా మంది కూర్చుంటారు.

నేను ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసి, సెలవలు కావడంతో వెళ్ళి అక్కడ కూర్చున్నాను.

గంగరావి చెట్టు క్రిందనే రకరకాల దుంగలు చిన్నవీ, కొయ్య మొద్దులూ, చెక్కలూ - రైతులు ఏవో పనిముట్లు చేయించుకోవడం కోసం తెచ్చి పడేసినవి వుంటాయి ఎప్పుడూ!

ఒక అరుగు కూడా వుంది.

ఆ అరుగు మీదా, ఆ దుంగల మీదా కూర్చుంటారు వచ్చిన వాళ్ళు.

క్రిష్ణాచారికి వృత్తిలో పెద్దగా నైపుణ్యం అలవడలేదు. మాటల మీద వున్న ధ్యాస పని మీద లేకపోవడంతో అతని పని అంతంత మాత్రంగానే సాగుతుంటుంది.

వాళ్ళు మరీ కటిక పేదవాళ్ళు కాకపోయినా కలిగిన వాళ్ళు మాత్రం కాదు. విశాలమైన స్థలం కలిగి వున్న చిన్న ఇల్లూ, అర ఎకరం పొలమూ, రెక్కలూ - తప్ప వేరే ఆస్తిపాస్తులు ఏమీ లేవు.

వాళ్ళ నాయన పోయి మూడేళ్ళు అవుతోంది. ఆయన మంచి పనివాడు. సున్నితమైన కొయ్య పనులు కళాత్మకంగా, అందంగా చేయడంలో ఆయనని తట్టే వాళ్ళు ఎవరూ ఉండరని వూళ్ళో జనం చెప్పుకుంటారు.

ఊళ్ళో వున్న దేవాలయం ముఖద్వారం దర్వాజమీద ఆయన చేసిన జాలుతో వున్న సింహాల బొమ్మలు ఇవ్వాళా జీవం ఉట్టిపడుతున్నట్లే వుంటాయి.

పండిత పుత్ర పరమశుంఠః అన్నట్లు ఆయన ఎంత మంచి పనివాడో, ఎంత నిపుణుడో కొడుకు అంత పనికి మాలిన వాడనీ, చేతకానివాడనీ అంటారు. ఆనవాయితీగా వస్తున్న వాళ్ళ ఆసాములు మాత్రం తిడుతూనో, విసుక్కుంటూనో ఇతనితో పనులు చేయించుకుంటారు.

తిరగళ్ళకీ, కొడవళ్ళకీ పిడులు చేయడం, పీటలూ, కర్రమంచాలు చేయడం, ఇండ్లకి సంబంధించిన పనుల్లో మేకులు దిగ్గొట్టడం ఇలాంటి పనులు మాత్రం చేస్తుంటాడు.

ఇక రైతులకి అవసరమైన గొర్రూ, గుంటకలూ, నాగళ్ళూ మాత్రం అతని బావని తోడు తెచ్చుకునో, తనే నానా తంటాలు పడుతూనో ఏదో ఒక రకంగా పని అయిందనిపిస్తాడు.

ఇద్దరు ముగ్గురు ఇతని ఆసాములు అయితే ఇతను పనిముట్లు చెడగొడతాడని, వేరే వాళ్ళ దగ్గరకి వెళ్ళి చేయించుకున్నారు.

క్రిష్ణాచారి తన ఆసాములకి పనిముట్లు చేసిన తన కులపు వాళ్ళ మీదకి వెళ్ళి తగాదా పెట్టుకుని, వాళ్ళని నానా తిట్లు తిట్టి గొడవ చేశాడు.

విషయం యాత్రల దగ్గర్నించి ఫర్నీచర్ దగ్గరికి వచ్చింది

"ఉండే కొద్దీ మీ పనులకి కూడా డిమాండ్ పడిపోతందిలే ఆచారీ! ఇప్పుడు అన్నీ ప్లాస్టిక్ కుర్చీలూ, టేబుళ్ళూ, తలుపులూ వస్తున్నయ్యి! మీకు పనులు ఇంక తగ్గిపోతయ్యి, చూస్తుండు!" అన్నాడు ఒక రైతు.

"అసలు కొయ్య సామాన్లని మించిన సామాన్లు ఏముంటయ్యంట? నా చిన్నప్పుడే మా నాయన ఒక ఇనప కుర్చీ కొన్నాడు. అది ఎన్నిసార్లు ఇరిగిపోయిందో, ఎన్నిసార్లు ఎల్డింగు చేయించానో లెక్కలేదు. చివరికి యిసుగుపుట్టి మూలన పడేసే సరికి తుప్పు పట్టిపోతే, మమ్మ ఉల్లిపాయలోడికి వేసింది. వైరు కుర్చీలనీ, పేము కుర్చీలనీ, నవారు కుర్చీలనీ ఎన్ని రకాల కుర్చీలు వచ్చినయ్యా? ఏవైనా వున్నయ్యా? ఎప్పుడో ఎనకటి రోజుల్లో మా తాత చేసిన కొయ్య కుర్చీ ఇయ్యాల చెక్కు చెదరకుండా ఇంటో వుంది. ప్లాస్టిక్ కుర్చీలు వస్తన్నయ్యంటన్నావు కానీ, ఇయ్యి మాత్రం ఎన్ని రోజులు వుంటయ్యో చూడమూ?; తెచ్చిన మూడో నాటికే యిరిగిపోయి ఎందుకూ పనికి రాకుండా పోకపోతే అప్పుడు నన్ను అడుగు! పైపై దాబులే తప్ప ప్లాస్టిక్ కుర్చీలు ఎందుకు పనికి వస్తయ్యంట?" క్రిష్ణాచారి అన్నాడు.

ఎలా తూచినా మొగ్గు తనవైపే

వుండాలంటాడు. తను ఏం మాట్లాడినా అది రైటయి తీరాలంటాడు. ఎవరైనా, ఏదయినా విషయం కదిలించడం ఆలస్యం. ఇకదాని గురించి విశ్లేషించాల్సిందే!

ఆవకాయ పచ్చడి దగ్గరనించీ అణుబాంబు దాకా, అమెరికా వాడి దగ్గరనించి అంతరిక్షం వరకూ ఏ విషయమైనా తనకి తెలిసినట్లే మాట్లాడతాడు. ఆ మాట్లాడే తీరులో కూడా దబాయింపు స్వరం వుంటుంది. ఎలాగైనా తను నెగ్గుకురావాలనే ధోరణి వ్యక్తమవుతుంది.

చాలాసేపు కూర్చుని, మా అమ్మ పిలవడంతో ఇంటికి వచ్చాను.

మా ఇంటికి ఎదురు రోడ్డుకి ఆవల వైపు వాళ్ళ ఇల్లు వుండటం, నాతోపాటు కలిసి చదువుకోవడం, చిన్నప్పుడు కలిసి మెలిసి ఆడుకోవడం, కుడిఎడంగా నాఈడే కావడం - ఇలా మా మధ్య ఒక రకమైన పరిచయం వుంది తప్ప, అది గాఢమైన, సన్నిహితమైన స్నేహం మాత్రం కాదు.

ఇంటర్మీడియట్ రిజల్ట్స్ వచ్చాయి. బొటా బొటీ మార్కులతో పాసయ్యాను. డిగ్రీ చేరాలి. మాకు దగ్గరలో వున్న ఒంగోలు, చీరాల ఎక్కడో చోట కాలేజీలో చేరాలనుకున్నాను.

స్నేహాల వలన చెడిపోతాననే కారణంతోనో, డబ్బు మిగుల్తుందనే వుద్దేశమో కానీ మా నాన్న నన్ను ఉద్యోగరీత్యా రాజమండ్రిలో వుంటున్న మా బాబాయి దగ్గరకు తీసుకుపోయి అక్కడ కాలేజీలో చేర్చి వచ్చాడు.

మా బాబాయి మొండి ఘటం. నన్ను వూరికి పంపించే వాడు కాదు. దసరాకీ, సంక్రాంతికీ సెలవులు ఇచ్చినా వూరికి పోలేదు. నాక్కూడా గట్టిగా వెళ్ళాలని లేదు. అమ్మా నాన్న అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు. ఇక ఏముంటుంది ఆ పల్లెటూళ్ళో? మధ్యలో ఒకసారి మాత్రమే వచ్చి రెండు రోజులు వుండి వెళ్ళిపోయాను.

మొదటి ఏడాది డిగ్రీ పరీక్షలు రాసి ఎండాకాలం సెలవలకి మా వూరికి వచ్చాను.

క్రిష్టాచారి అలాగే మాటల రవ్వలు రాల్చుతూ ఏదో చిన్న పని చేసుకుంటున్నాడు.

నన్ను చూసి నవ్వి పలకరించాడు. ఎప్పుడొచ్చావని అడిగాడు. అంతకుముందు రోజు వచ్చానని చెప్పడంతో, మీలాంటి వాళ్ళకి మేం కనపడతామా అన్నాడు. ఇన్ఫీరియారిటీతోనో, వెటకారంగానో, వ్యంగంగానో ఆ మాట అన్నట్లు నాకనిపించింది.

నల్లగా మురికి ఓడుతున్న లుంగీ చిరిగిపోయింది కట్టుకుని బీడి దమ్ములాగుతూ ముక్కాలిపీట తయారు చేస్తున్నాడు.

వాళ్ళ ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడినట్లు నాకు అనిపించలేదు. మెరుగుపడే అవకాశం మాత్రం ఏం వుంది? ఎలా వుంటుంది?

క్రిష్టాచారికి ఇద్దరు అక్కలూ, ఒక చెల్లెలూ వున్నారు. మగపిల్లవాడు ఇతను ఒక్కడే! ఆడపిల్లలకి పెళ్ళిళ్ళయి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇంట్లో వాళ్ళ అమ్మ, అతనే వుంటారు. అతని సంపాదనే ఆధారం.

సెలవుల అనంతరం కాలేజీకి వెళ్ళిపోయాను.

రోజులు జరిగిపోతున్నాయి.

జనవరి నెలలో మా వూరు వచ్చాను. గదిలో నవారు మంచం, అల్లుతూ, ఎవరివో మాటలు వినబడుతుంటే ఎవరా అని కిటికీలో నించి చూశాను. క్రిష్టాచారి అమ్మ.

"పిల్లవాడు మరీ పనికిరాకుండా పోయాడు వదినా! ఇంతకుముందు ఎవరో ఒకరికి చిన్నపనో, పెద్ద పనో చేసి పదో పరకో తెచ్చి నా చేతికి ఇచ్చేవాడు. ఇప్పుడు పనులూ అంతంత మాత్రంగానే వుంటున్నాయి. వీడు చేయడమూ అంతంతమాత్రంగానే వుంది. ఇవ్వాల్టి రోజుల్లో వెదుకులాడుకుంటేనే పనులు దొరకడం కష్టమైతే, వీడు వచ్చిన పని కూడా చేయకుండా తిరుగుతున్నాడు. అదేమంటే నోటికి ఏ మాట వస్తే ఆ మాట అంటున్నాడు!"

"పెళ్ళి చేయరాదంట వదినా! నెత్తిమీద బరువు పడితే వాడే దారికి వస్తాడు. ఇలా ఎంతమందిని చూళ్ళేదూ, పెళ్ళయ్యే వరకూ బలాదూర్‌గా తిరిగి మూడు ముళ్ళు వేసి ఒక దారికి వచ్చిన వాళ్ళని!" మా అమ్మ అంది.

"మా పెద్దమ్మాయి రేపు చైత్రమాసంలో చేద్దామంటంది వదినా! నేనే వెనకాముందాలోచిస్తున్నాను. వీడు బతకడమే అంతంత మాత్రం అయితే రేపు ఆ పిల్లకి ఎక్కడ తెచ్చిపెడతాడు?"

"అయితే మనవరాల్ని చేస్తావన్నమాట!"

"మనవరాల్ని పెట్టుకుని బయటికిపోతే లోకులు ఆక్షేపిస్తారు కద వదినా! మేం అనుకుంటున్నాం కానీ, అసలు వాడేమంటాడో! పిల్లకుందనపు బొమ్మ మాదిరిగా వుండిద్ది! వంక పెట్టాల్సిన పని లేదు. వీడు ఒంటిగాడెయ్! అల్లుడు అండగా వుంటాడు!" అంది ఆమె.

కొద్దిసేపు మాట్లాడిన తరువాత ఆమె వెళ్ళిపోయింది. పవిట చెరుగులో బియ్యం మూటగా వేలాడుతున్నాయి.

మా అమ్మ గదిలోనికి వచ్చింది. "కొడుకు అక్కరకు రాకుండా పోయాడని ఆమె దిగులురా! జరుగుబాటు లేదు. ఆ పిల్లాడేమో పని మానుకుని వాస్తు అంటూ తిరుగుతున్నాడు. వాస్తు పిచ్చి బాగా పట్టుకుంది. మొన్న ఎక్కడికో పోయి కొన్ని పుస్తకాలు కొనక్కొచ్చాడు. వాస్తు నేర్చుకోవాలని ఎక్కడెక్కడికో, ఎవురెవురి దగ్గరకో తిరుగుతున్నాడు. ఆమె ఎంతకని పోరకాడిద్ది? ఇంటో జరగడం లేదంటే మానెడు బియ్యం ఇచ్చా! రాత్రి అన్నం కూడా వండుకోలేదంట!" చెప్పింది మా అమ్మ.

క్రిష్టాచారి వాళ్ళ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని, ఏ పూటకాపూట వెనుట్లోకి వెదుకులాడుకోవడమేనని నాకు అర్థమైంది.

"కిట్టాచారి తెలివితక్కువోడేం కాదురా! బతకనేర్చిన తెలివి వుంది. కానీ ఇవ్వాళ వాళ్ళకి పనులేవి? ఊళ్ళో అరకలు లేకపోయె! ఇంతకుముందు మనూళ్ళో మూడొందలు అరకలు వుండెయ్యి! ఇయ్యాల తిప్పితిప్పి చూసినా పది పన్నెండు కంటే ఎక్కువ లేవు. విత్తనాలు ఎద పెట్టడం దగ్గర్నించి అన్ని పనులూ ట్రాక్టర్లే చేస్తండే! కాడి పట్టే రైతే లేనప్పుడు పనులేముంటయ్యి? బాగా పని చేసే వాడికే పనుల్లేకపోతే అతనికి ఎవరు చెపుతారు పని" అన్నాడు మా నాన్న.

తరువాత నాలుగు రోజులకి నేను కాలేజీకి వెళ్ళిపోయాను. మళ్ళీ ఎండాకాలం సెలవులు వచ్చేసరికి క్రిష్టాచారిని చూసి ఆశ్చర్యపోయాను.

గెటప్ పూర్తిగా మార్చేశాడు. తెల్లటి లాల్చీ వేసుకుని, పంచెకట్టి, నుదుటిమీద నిలువు బొట్టు పెట్టాడు.

ఉదయం పది గంటల ప్రాంతంలో గంగరావి చెట్టు క్రింద అరుగు మీద ఇద్దరు ముగ్గురు కూర్చుని వుంటే నేను కూడా వెళ్ళి వాళ్ళ దగ్గర కూర్చున్నాను.

క్రిష్టాచారి లోపలి నుంచి వచ్చాడు.

"ఏం కిట్టాచారీ... ఈ మధ్య ప్రయాణాలు ఎక్కువయినయిగా! ఊళ్ళో ఎప్పుడు చూసినా వుండటం లేదు..." ఒకతను అడిగాడు.

"ఎక్కడా... ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తానే వుంట్రి! మరీ ఉమ్ము వూసుకునే తీరుబడి కూడా లేకుండా పోయిందనుకో! ఆదాయం లేకపోయినా నా అంత వాస్తు పండితుడు చుట్టుపక్కల ఏ వూళ్ళో కూడా లేడని పేరు మాత్రం వచ్చిందీ..."

తనని తానే పొగుడుకునే క్రిష్టాచారి ధోరణికి ఆశ్చర్యపోయాను.

"ఇయ్యాల మాత్రం గాలి పీల్చుకునే ఖాళీ దొరికింది. ఈ ఎండలకి తిరిగీ తిరిగీ యేడి తీసుకుంది. అసలు ఇయ్యాల ఇంటో నించి కదలదలుచుకోలా!"

"వీడియ్యి అన్నీ ఎచ్చులేరా! పదో పాతికో సంపాయిచ్చటం, ఒంగోలు పోయి సినిమాలూ, తిరుగుళ్ళూ తిరిగి రావటం - అదీ వీడి బిజీ!" మాతోపాటు కలిసి చదువుకున్న తిరుపాలు నా ప్రక్కనే కూర్చుని, మోచేత్తో నన్ను పొడిచి చిన్నగా చెప్పాడు.

"అయితే వాస్తు మొత్తం నేర్చుకున్నట్టేనా?" ఒకరు అడిగారు.

"నేర్చుకునేది ఏముంది? నాకు తెలియకపోతే గదా! వాస్తు పుస్తకాలు అన్నీ ఎప్పుడో చదివేశాను... మనూళ్ళో ఎవురెవురి ఇంటికి ఏయే దోషాలు వున్నాయో చెపుతా వినుకో!" అని క్రిష్టాచారి అనర్గళంగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

"వెంకయ్యాగారింటో బర్రె ఎందుకు చచ్చిపోయిందనుకున్నారూ? వాళ్ళింటికి ఈశాన్యంలో వేధవాస్తు దోషం వుంది. సుబ్బయ్య వాళ్ళనాయనకి మొన్న పక్షవాతం ఎందుకు వచ్చిందనుకున్నారూ? వాళ్ళింటికి ఆగ్నేయ మూలలో కోణవేధ దోషం వుంది. అది సవరించుకోమని నేను చెప్పాను కానీ డబ్బులు వచ్చిన తరువాత చేస్తాను అన్నాడు. మనకి డబ్బులు వచ్చే వరకూ దిక్పాలకులు వూరుకుంటారా? దిక్పాలకుల్లో ఏ పాలకుడికి ఆగ్రహం వచ్చినా అంతే! చాలా అనర్థాలు జరుగుతాయి. రాజమ్మ వాళ్ళ అబ్బాయి పదో తరగతి ఎందుకు తప్పాడో తెలుసా? వాళ్ళింటికి నైరుతీ దిశలో బుద్ధుత వేధ దోషం వుంది. ఆ దోషం వున్న వాళ్ళకి అపజయాలే తప్ప విజయాలు ఎన్నటికీ చేకూరవు. నారాయణ వాళ్ళింటో పదిమంది వున్నారా? వాళ్ళింటో చూడండి, ఎప్పుడూ ఎవరో ఒకరికి రోగమే! ఆ ఇంటికి నైరుతీ దిశలో ఛాయావేధ దోషం వుంది. ఆ దోషం వున్న వాళ్ళింటో ఎప్పుడూ ఎవరో ఒకరికి అనారోగ్యం ప్రాప్తిస్తూనే వుంటుంది. ఎక్కడి వరకో ఎందుకూ... మొన్న జాలయ్య కొడుకు సైకిల్ మీద నించి పడ్డాడు కదా? ఎందుకు పడ్డాడో మీకు ఎవురికైనా తెలుసా? వాళ్ళింటికి నైరుతీ దిశలో బావి వుంది. ఆ దిశలో బావి వుంటే ఎంత దోషం! ఆ బావిని పూడ్చుకోమని నేను నాలుగు సార్లు చెప్పాను. నా మాట వింటే కదా?"

"ఆ బావిది మంచి జల కిట్టాచారీ! ఎండాకాలంలో కూడా బావిలో ధారాళంగా నీళ్ళుంటాయి. ఊళ్ళో బావులన్నీ ఎండిపోయినా ఆ బావి ఎప్పుడూ ఎండిపోదు!" అన్నాడు దస్తగిరి అనే ఆయన.

"మంచి జల గల బావిని ఎట్టపూడ్చేదీ అన్నాడు జాలయ్య కూడా! ఎంతమంచి జల అయితేనేం, అసలు ఆ *దిక్కులో బావే వుండకూడనప్పుడు! సరే దస్తగిరీ... మీ* ఇంటి పక్కన రామయ్యకి ఇయ్యేడు వ్యవసాయంలో నలభైవేలు దండగంట! దండగ ఎందుకు వచ్చిందో తెలుసా... వాళ్ళ ఇంటి ముందు బయటి వాకిలి ఎటు చూస్తంది? సూటిగా శివాలయం ధ్వజ స్తంభాన్ని చూస్తంది! ధ్వజస్తంభం పోటీ అంటే సామాన్యమా? ఆయన బయటి వాకిలి దిశ మార్చుకుంటే తప్ప దశ మారదు అని నాకు తెలుసు! పిలవని పేరంటంగా పోయి మనం సలహా ఎందుకు ఇవ్వాలి? వాస్తు అనేది పెద్ద శాస్త్రం! అది సామాన్యులకి అర్థమయ్యే విషయం కాదు!"

క్రిష్టాచారి మాటల ప్రవాహానికి, ఉరవడికీ అందరూ అమితాశ్చర్యంగా నోరు తెరిచి వింటున్నారు. నోరు తెరిచి ప్రశ్నించిన వాళ్ళు లేరు.

పెద్ద కంఠంతో తిరుగులేని విధంగా మాట్లాడుతున్నాడు. ఒక్కొక్కరు వస్తూనే వున్నారు. చివరకు చాలా మంది చేరారు.

క్రిష్టాచారి ఇంకా ఉత్సాహంగా ఎవరెవరి ఇళ్ళకు ఏయే దోషాలు వున్నాయో, ఆ దోషాల కారణంగా

(మిగతా 23వ పేజీలో)

చరిత్ర పట్ల సముచిత వైఖరి ఉండాలి



ఆంధ్రజాతీయ పునరుజ్జీవనలో కమ్యూనిస్టు పార్టీ మహోజ్వల పాత్ర
రచన : పరకాల పట్టాభిరామారావు
వెల : రు. 50/-, ప్రతులకు : పరకాల అహల్యా దేవి, సంఘమిత్ర ప్రచురణలు, 32-13-53-7/ఎ, జర్నలిస్ట్ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ - 10; విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

తెలుగు సాహిత్య సంస్కృతీ వికాసంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్వహించిన చారిత్రిక పాత్రకు సంబంధించిన వార్తలు నివేదికలు, విశేషాలు సంకలనం చేసిన పుస్తకం ఇది. విశాలాంధ్ర సీనియర్ జర్నలిస్టు పరకాల పట్టాభి రామారావు శ్రమ కోర్చి వీటిని సేకరించి ప్రచురించారు. ఈ నాడు మనం అందరం అంగీకరిస్తున్న అనేక అంశాల వెనక ఆరంభంలో ఎంత పోరాటం, కృషి వున్నాయో తెలుసుకోవడానికి ఇవి సహాయ పడతాయి.

వీరేశలింగం, గురజాడ వంటి వారి వారసత్వ ఔన్నత్యాన్ని గుర్తించి పునరుద్ధరించి తెలుగు సాహితీ సంస్కృతుల పునర్వికాసానికి కమ్యూనిస్టు పార్టీ చేసిన దోహదం అపూర్వమైంది. 1944 మే నెలలో పులుపుల శివయ్య, మాకినేని బసవపున్నయ్య పార్టీ ప్రతినిధులుగా రాజమండ్రి వెళ్లి వీరేశలింగం స్థాపించిన హితకారిణీ సమాజం కార్యదర్శిని కలిసి ఆయన రచనల పునర్ముద్రణకు అనుమతి పొందారు. అదే ఏడాది మే 27 న ఆయన వర్ధంతి సభలు జరపడం ప్రారంభమైంది. గురజాడ రచనలు కూడా అలాగే వెలికి తీసి ముద్రించారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఆత్మకథ ప్రచురించడమే కాక ఆయనను సత్కరించారు. కొమర్రాజు లక్ష్మణరావు, గిడుగు, కాశీనాథుని నాగేశ్వర రావు వంటి జాతీయనాయకుల ఉదార వాదుల సంస్మరణ సభలు కూడా జరిగాయి. ఆంధ్ర ప్రజానాట్య మండలి, అభ్యుదయ రచయితల సంఘం అపూర్వమైన ప్రజా కళా సాహిత్యాలను సృష్టించాయి. ఈ పరిణామాలను, పత్రాలను, నాటి పెద్దల వ్యాఖ్యానాలను పట్టాభి ఇందులో పొందుపరచారు.

అయితే ఈ సందర్భంగా ఆయన చేసిన విశ్లేషణలలో పాక్షికత్వం, కొన్ని అవాస్తవ సమాచారాలు, పొరబాటు అంచనాలు వుండటం విచారకరం. అభ్యుదయ రచయితల ఉద్యమంలో పొడసూపిన పొరబాటు ధోరణులను, అది కొడి గట్టడానికి దారి తీసిన పరిస్థితులను చారిత్రికంగా తెలియజేసే బదులు సుందరయ్య గారి వంటివారు సెక్టేరియన్ వైఖరులు అనుసరించడం వల్లనే అంతా దెబ్బ తిన్నదనే అభిప్రాయం కలిగించడానికి ప్రయత్నించినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. ఇంకా చెప్పాలంటే మద్దుకూరి చంద్రం గారు సవ్యంగా చేస్తే సెక్టేరియన్ వైఖరులు నష్టం కలిగించినట్టు చిత్రించారు.

నేటి వాతావరణంలో ఇలాటి వివాదాలకు ఆయన ఆస్కారం ఇచ్చి వుండవలసింది కాదు. మద్రాసులో 1947లో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం మహాసభల తీవ్ర లోపాలపై నార్ల వెంకటేశ్వర రావు వంటి కమ్యూనిస్టు వ్యతిరేకులు, దరిశి చంచయ్య వంటి దేశభక్తులు, ఆఖరుకు ఆయన పాక్షికంగా ఉటంకించిన కొడవటి గంటి కుటుంబరావు, మద్దుకూరి చంద్రం కూడా విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించడం నిజం కాగా అవన్నీ వదలి పెట్టి సుందరయ్య గారి విమర్శ పొరబాటైనట్లు విరుచుకు పడటం విడ్డూరం. అందరినీ కలుపుకొని రావాలనే తాపత్రయంలో కనీస ప్రగతిశీల విలువలు కాపాడుకోవడానికి అవసరమైన మెళకువ, స్పష్టత కూడా లోపించడం అభ్యుదయ రచయితల సంఘం దెబ్బ తినడానికి కారణమైందనేది నిర్వివాదాంశం. 1955 ఎన్నికలలో రచయితలు కమ్యూనిస్టు వ్యతిరేక శిబిరంలో చేరడం గురించి ఆయన చాలా రాశారు. అందుకు వ్యతిరేకంగా నార్లచిరంజీవి రాసిన లేఖను కూడా పొందు పరచారు. కాని ఆ పరిణామం అకస్మాత్తుగా వచ్చిందా? సుందరయ్య గారు ఎత్తి చూపిన దోషాలు అందుకు దారితీశాయని ఇప్పటికైనా అంగీకరించడం మంచిది కదా? అలాగే సర్క్యులర్ల ద్వారా సాహిత్యాన్ని శాసించడానికి ప్రయత్నం జరిగిందంటూ ఆయన ఏరిన రచనలు ఉటంకించారు. ఆ సర్క్యులర్లు పార్టీలో చర్చకు ఉద్దేశించినవే కాని సంఘాన్ని శాసించడానికి కాదని పట్టాభి వంటి వారికైనా తెలియదా? రచనల పైన, అభ్యుదయ సంచికలపైన సుందరయ్యగారు పార్టీలో ఆంతరంగిక చర్చకోసం తన అభిప్రాయాలు రాయడం తప్పా? అలాగే తెలుగు సాహిత్యంలో నూతన ధోరణుల గురించి చంద్రం రాసిన అభిప్రాయాలు సరైనవి కావని భావించడం కూడా పెద్ద పొరబాటా? సుందరయ్య గారి అభిప్రాయాలపై పట్టాభి వ్యాఖ్యలలోని అనౌచిత్యాలను సోదాహరణంగా పేర్కొనడం స్థలాభావం దృష్ట్యా సాధ్యం కాకపోవడం అటుంచి అనవసరం కూడా.

ఏమైనా ఇప్పటి తరానికి (ఈ సమీక్షకుడితో సహా) ప్రత్యక్షంగా పరిచయంలేని కాలానికి సంబంధించిన ఇలాటి ఇతివృత్తం ఎంచుకున్నప్పుడు వుండవలసిన సమతుల్యత లేకుండా ఆ నాడు కమ్యూనిస్టు నేతలలో కొందరు సానుకూల పాత్ర, మరి కొందరు సెక్టేరియన్ పాత్ర పోషించినట్టు చిత్రించడం పట్టాభి వంటి అనుభవజ్ఞులకు తగని పని. ఆయన పొందు పరచిన వివరాలు, ఇతరుల అభిప్రాయాలు కూడా ఆ కోవలోనే వుండటం మరింత విచారకరం. సమిష్టి కృషిగా చూడవలసిన దాన్ని నేటి మన అనుబంధాల సులోచనాలతో చూడటం, చూపటం మంచిది కాదు. మన స్వంత అభిప్రాయాలు, అభిమానాలు ఏమైనా చరిత్రను చరిత్రగా చూపడం రచయిత, సంకలన కర్త బాధ్యత. అలాటి సంయమనం సమగ్రత పట్టాభి రామారావు ప్రదర్శించి వుంటే ఈ సంకలనం సార్థకమై వుండేది. అప్పుడు పత్రాల ఎంపిక కూడా మరోవిధంగా వుండేది.

నేటి సంక్లిష్ట రాజకీయ సాంస్కృతిక నేపథ్యంలో అభివృద్ధి నిరోధక శక్తులు, అంతర్జాతీయ సామ్రాజ్యవాదుల సవాళ్లను, సాంస్కృతిక రంగంలో పెరుగుతున్న సవాళ్లను సమైక్యంగా ఎదుర్కోవడం ప్రగతిశీల కళాకారులు రచయితల ముందున్న కర్తవ్యం. తెలుగు నాట సాంస్కృతిక పునర్వికాసానికి సంబంధించిన చరిత్ర అందుకు స్ఫూర్తి దాయకమవుతుంది. ఆ దిశలో చాలా అధ్యయనం ఇంకా జరగవలసే వుంటుంది. పట్టాభి వంటి వారు అందుకు మరింత శ్రద్ధ పెడతారని ఆశించాలి.

- తెలకపల్లి రవి

స్వీకారం

మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలో మహోన్నతమైన సిద్ధాంతవేత్తగాను, గొప్ప కార్య శూరుడుగాను మావోను ప్రపంచంలోని కమ్యూనిస్టులంతా గుర్తించుతారు. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద జనాభా కలిగిన దేశమైన చైనా విప్లవాన్ని జయప్రదంగా సాధించిన చైనా కమ్యూనిస్టు పార్టీకి సారధిగా వున్న మహానాయకుడు ఆయన. మార్క్సిజం, లెనినిజం శాస్త్రాన్ని సృజనాత్మకంగా అన్వయించి, అందుకనుగుణంగా చైనాలో విప్లవ వ్యూహాన్ని, ఎత్తుగడలను రూపొందించిన ఘనుడు ఆయన. విప్లవం పైనా, కమ్యూనిస్టు ఉద్యమంపైనా, వ్యూహం, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యలపైనా ఆయన రాసిన రచనలలోనూ కొన్ని సూక్తులను సంకలనం చేసి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రచురించింది. అది ఇంగ్లీషులో 'కొటేషన్స్ ఫ్రం ఛైర్మన్ మావో సెతుంగ్' అనే పేరుతో వెలువడింది. దాన్ని మావో సూక్తులు పేరుతో 1967 నవంబర్‌లో ఆనాడు ఆంధ్రలో మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా వున్న చంద్రపుల్లారెడ్డి కొద్దిగానూ, పార్టీ దినపత్రిక జనశక్తి సంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్న వి.ఆర్.బొమ్మారెడ్డి అత్యధిక భాగాన్ని తెలుగులోకి అనువదించగా సోషలిస్టు పబ్లికేషన్స్ తరఫున ప్రచురించారు.

మావో సూక్తులు
ఆంధ్రానువాదం : చంద్రపుల్లారెడ్డి, వి.ఆర్.బొమ్మారెడ్డి; **వెల** : రు.25/-, **ప్రతులకు** : జయంతి పబ్లికేషన్స్, స్పందన పబ్లికేషన్స్ విజయవాడ, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, ఇతర ప్రముఖ బుక్‌షాపులు.

నా హృదయం



రచన : కొరిపెల్ల వీరవెంకట శ్రీనివాస్, **వెల** : రు.30/- **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్, కె.వి.వి.శ్రీనివాస్ (హెచ్.సి.988), ఎ.పి.ఎస్.పి.ఎఫ్., ఎ.పి. సెక్రటేరియట్, హైదరాబాద్.

'చిత్రకళా వేదు...కంబగిరి రాజు'

కంబగిరి రాజు


రాజు వేసిన ఠాగూర్ పెయింటింగ్

ప్రకృతి సౌందర్యాన్ని ప్రజల హృదయానికి హత్తుకునేలా చేసేది చిత్రలేఖనం. ఈ రంగంలో ఎంతో మంది ప్రతిభావంతులు పుట్టుకువచ్చారు. వారికోవలోకే చెందుతారు కంబగిరి రాజు. 72 ఏళ్ల వయసులో కూడా ఇంకా చిత్రలేఖనంలో పాఠాలు చెబుతూనే ఉన్నారాయన. కర్నూలు జిల్లా పాణ్యంలో 1926లో జన్మించిన రత్నాకరం చిన్న కంబగిరి రాజు, 1955లో పాణ్యం ఉన్నత పాఠశాలలోనే హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ మాస్టర్‌గా ఉద్యోగం పొందారు. 1985 వరకు వృత్తిపరంగా విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పడంతో పాటు కమర్షియల్ ఆర్టిస్టులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తన దగ్గరకు వచ్చిన వారందరికీ చెబుతుండేవారు. తన శిష్యుల్లో 18 మందిని డ్రాయింగ్ మాస్టర్లుగా తీర్చిదిద్దారు. జిల్లావ్యాప్తంగా 13 మంది హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ మాస్టర్లు, ఐదుగురు డిప్లొమా డ్రాయింగ్ మాస్టర్లతో పాటు జిల్లాలో పేరుగాంచిన కమర్షియల్ ఆర్టిస్టులు కూడా ఆయన శిష్యులే. పాణ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో ఆయన గీచిన గీతోపదేశం, గాంధీ-నెహ్రూల సమావేశం, దేశనాయకుల వర్ణ చిత్రాలు నేటికీ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 1965లో కర్నూలు పట్టణంలో ప్రభుత్వం నిర్వహించిన జిల్లా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఆయన గీసిన గీతోపదేశం చిత్రానికి ప్రథమ బహుమతి వచ్చింది. 1976లో ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానం అందుకున్నారు. 1969లో నూతన భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన అప్పటి గవర్నర్ పట్టం థానుపిళ్ళై ఆయన చిత్రాలను చూసి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన తైలవర్ణ చిత్రలేఖన నైపుణ్యాన్ని గుర్తించిన బ్లూసమ్స్ డ్రాయింగ్ కాంటెస్ట్ నేషనల్ ఆర్ట్ సర్వీస్, హైదరాబాద్ వారు గత ఏడాది నంద్యాలలో ఘనంగా సన్మానించారు. వయసు పైబడుతున్నప్పటికీ తనకు తెలిసిన విద్యను నలుగురికి చెప్పడానికి ఆయన ఇప్పటికీ ఉత్సాహంతో ఉండటం అభినందనీయం.

-ఎ.కె. శ్రీనివాస్, పాణ్యం

'నాటకాన్ని వదిలి..హస్తకళను చేపట్టి...'


ఒకప్పటి నాటక బృందం

హైటెక్ టెక్నాలజీ మాయాజాలంలో చిక్కుకొని గ్రామీణ కళారూపాలు ఉక్కిరిబిక్కిరవ్వడం యాదృచ్ఛికం మాత్రం కాదు. ఒకప్పుడు తమ కళా నైపుణ్యంతో వేలాది ప్రదర్శనలిచ్చి గ్రామీణ ప్రాంత ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన కళాకారులు ఇప్పుడు రెండు పూటలా తిండికి ఇక్కట్లు పడుతున్నారు. నాటకాల వల్ల తిండికి ఇబ్బంది ఏర్పడటంతో హస్తకళల వైపుకు మొగ్గు చూపారు ధర్మవరం కళాకారులు. గతంలో వీరు సుందరకాండ, లంకాదహనం, సతీసులోచన, రామాయణం, ఇంద్రజిత్తుని యుద్ధం, మైరావణ చరిత్ర, లక్ష్మణ మూర్ఛ, రావణవధ, సీతాకళ్యాణం వంటి పురాణాలను, పౌరాణిక నాటకాలను ప్రదర్శించే వారు. ప్రస్తుతం వాటికి ఆదరణ కొరవడటంతో హస్తకళల వైపు దృష్టిసారించారు. తమ హస్తకళా నైపుణ్యంతో బెడ్ ల్యాంపులు, పప్పెట్లు, రకరకాల బొమ్మలు, జంతువుల చర్మంతో ఆకర్షణీయంగా తయారు చేసి ఎగ్జిబిషన్ల ద్వారా అమ్మకాలు ప్రారంభించారు. వీరి వస్తువుల పట్ల విదేశాల వారు మక్కువ చూపుతున్నా అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్లలో తాము తయారు చేసే వస్తువుల అమ్మకానికి అనుమతి లభిస్తేనే అమ్ముకోగలమని అంటున్నారు. ప్రభుత్వ ఎగ్జిబిషన్లలో తమ నైపుణ్యాన్ని చూసి మెచ్చుకొని ప్రశంసాపత్రాలు ఇస్తున్నారనీ, అవి మా కడుపులు నింపవు కదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు రుణాలకు వెళితే ఎన్నో నిబంధనలు పెడ్తారని, ప్రభుత్వం ఏరకంగానూ సాయం చేయడం లేదంటున్నారు.

-బి. రమేష్ నాయుడు, ధర్మవరం టౌన్

కూతురు వాటా

కర్రా ఎల్లారెడ్డి

హిందూ కుటుంబంలో పుట్టిన అవివాహిత యువతికి ఉమ్మడి కుటుంబ ఆస్తిలో అన్న దమ్ములతో సమానంగా వాటా ఉంటుందన్న విషయాన్ని చాలా మంది నమ్మరు. ఒకవేళ నమ్మినా ఆచరించరు. హిందూ వారసత్వ చట్టం కింద మహిళలకు తండ్రి ఆస్తిలో హక్కు ఉన్నప్పటికీ ఆచరణలో ఆ హక్కును అమలు పరచుకుంటున్న మహిళలు ఒక్క శాతం కూడా లేరు.

ఇలాంటి పరిస్థితుల్లో ఒక పెళ్లికాని యువతి తండ్రి ఆస్తిలో తన భాగం కోసం కోర్టుకు వెళ్ళిన కథ ఇది.

పద్మ అనే యువతికి 26 ఏళ్ళు ఉంటాయి. నగరంలోని గాంధీనగర్ ప్రాంతంలో పద్మ కుటుంబం కాపురం ఉంటున్నది. పద్మ తండ్రి పేరు రాజయ్య. ప్రస్తుతం ఆయన వయస్సు 62 ఏళ్ళు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు వున్నారు. పద్మకంటే పెద్ద వాళ్ళైన ముగ్గురి పెళ్ళిళ్ళు జరిగిపోయాయి. పద్మ అక్కను అదే నగరంలో వ్యాపారం చేసుకొనే ఓ వ్యక్తికి ఇచ్చి పెళ్ళి చేశారు. పద్మ పెద్దన్న కిరోసిన్ వ్యాపారం చేసుకుంటూ ఉమ్మడి కుటుంబం నుంచి వేరుగా ఉంటున్నాడు. పద్మ రెండవ అన్న ఉమ్మడి ఇంటిలోనే వేరొక పోర్షన్‌లో ఉంటున్నాడు. ఇక మిగిలింది పద్మ ఒక్కతే. వివాహం కానందువల్ల తల్లిండ్రుల వద్దనే ఉంటోంది ఆమె.

రాజయ్య తన నలుగురు పిల్లల్ని తన స్తోమత మేరకు చదివించాడు. కిరోసిన్ వ్యాపారం చేస్తూ ఒక ఇల్లు కట్టుకున్నాడు. మరొక ఇంటి స్థలం ప్లాటు కూడా వుంది. పెద్ద కూతురికి ఎంతోకొంత కట్నం ఇచ్చి పెళ్ళి జరిపించాడు. ఇద్దరు కొడుకులు వేరు కాపురాలు పెట్టి స్వతంత్రంగా బ్రతుకుతున్నారు. చిన్న కూతురు పద్మ వివాహం చేయడం ఎలా? అన్నదే రాజయ్య ప్రస్తుత సమస్య. ఆయనకు కొన్ని పాత అప్పులు కూడా వున్నాయి.

చిన్నకూతురు వివాహం గురించి రాజయ్య గత నాలుగైదేళ్ళ నుంచి కొడుకులతో చర్చిస్తూనే వున్నాడు. పెద్ద కొడుకు సరే అంటున్నా చిన్న కొడుకు మాత్రం చెల్లెలు పెళ్ళి విషయంలో శ్రద్ధ తీసుకోవడం లేదు. బంధువులు, కుల పెద్దలతో అడిగించినా కొడుకులిద్దరూ చెల్లెలు పెళ్లి చేయటానికి శ్రద్ధ చూపడం లేదు. చివరికి పెద్ద కొడుకు ఉమ్మడి ఆస్తిని అమ్మి అయినా సరే చెల్లెలు పెళ్లి చేద్దామని తండ్రితో అన్నాడు. కానీ రాజయ్య రెండవ కొడుకు ఆస్తిని అమ్మటానికి అంగీకరించడం లేదు.

ఇద్దరు అన్నల ప్రవర్తనతో విసుగు చెందిన పద్మ, ఆమె తండ్రి కలిసి ఒక న్యాయవాదిని సంప్రదించటానికి వెళ్లారు. రాజయ్య తన కుటుంబ సమస్యలన్నీ లాయర్‌కు వివరించాడు. ఎంతో కష్టపడి కొడుకులను పెంచానని, వారిని చదివించానని కానీ వారు మాత్రం చెల్లెలు పెళ్ళి చేయటానికి ముందుకు రావటం లేదని అన్నాడు. ఆస్తిని అమ్ముదామంటే చిన్నకొడుకు అడ్డుకుంటున్నాడని చెప్పాడు. ఆ లాయర్ తర్వాత పద్మ ద్వారా కోర్టులో కేసు వేయిస్తే ఆమెకు ఉమ్మడి కుటుంబ ఆస్తిలో వాటా వస్తుందని తెలిపాడు. ఆమెకు వచ్చిన ఆస్తి వాటాను విక్రయించి ఆమె వివాహం జరిపించుకోవచ్చునని వివరించాడు.

సివిల్ కోర్టుకు వెళ్లి కేసు వేస్తే చాలా ఏళ్ళు పడుతుంది కదా అని రాజయ్య సందేహ పడ్డాడు. ఇప్పటికే తన కూతురు వయస్సు 26 దాటి 27 వస్తోందని అన్నాడు. ఇలాంటి సివిల్ కేసులు ఏడాది నుంచి మూడేళ్ల లోగా పూర్తయ్యే అవకాశం వుందని వారి లాయర్ చెప్పాడు. ఒక కేసును కోర్టులో దాఖలు చేశాక అది ఎన్నాళ్ళకు ముగుస్తుందన్న విషయం చెప్పలేమని అన్నాడు. ఒక్కొక్క కేసును ఒక నిర్ణీత కాలంలో విచారణ పూర్తి చేసి తీర్పు చెప్పాలనే నిబంధన ఏ చట్టంలోనూ విధించలేదని అన్నాడు. వాది, ప్రతివాదుల ప్రవర్తనపై, పట్టుదలపై కేసు విచారణ ఆధారపడి ఉంటుందని, న్యాయమైన కేసుల్లో కూడా చాలా సందర్భాల్లో ఏళ్ళూ పూళ్ళూ గడుస్తాయని వివరించాడు. ఒక్కోసారి ప్రతివాదులకు నోటీసులు అందగానే వారు రాజీకి వస్తే ఆ కేసులో వెంటనే తీర్పు వస్తుందని చెప్పాడు.

అంతా విన్న తర్వాత మరేదైనా సులభ మార్గం ఉండే ఆలోచించండని రాజయ్య తన న్యాయవాదిని వేడుకున్నాడు.

ఇటీవల కాలంలో ప్రతి జిల్లాలో పని చేస్తున్న న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్న విషయం లాయర్‌కు జ్ఞాపకానికి వచ్చి సివిల్ కేసుకు బదులు న్యాయసేవా సంస్థ ముందు ఫిర్యాదు దాఖలు చేయటానికి నిర్ణయించాడు.

లాయర్ మరుసటి రోజే పద్మ తరఫున ఫిర్యాదు తయారు చేసి న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో అందజేశాడు. తమ ఉమ్మడి ఆస్తిలో తనకు రావలసిన వాటాను ఇవ్వాలని పద్మ తన తండ్రి, ఇద్దరు అన్నలపై ఫిర్యాదు చేసింది. నిజానికి ఆమె పెళ్ళి చేయటానికి, ఆస్తి అమ్మి ఇవ్వటానికి ఆమె తండ్రి, పెద్దన్న అంగీకరిస్తున్నారు. ఒక్క చిన్నన్న మాత్రమే ఆమెకు వాటా ఇవ్వటానికి అంగీకరించటం లేదు. అయితే ఇలాంటి సందర్భాల్లో కేసులు వేయాల్సి వచ్చినప్పుడు చట్ట ప్రకారం ఫిర్యాదు చేయాల్సి వుంటుంది. తీర్పు చెప్పేటప్పుడు ఆ ఆస్తికి హక్కుదారులైన వారందరికీ వర్తించేలా న్యాయమూర్తి తీర్పు చెబుతారు. అందుకే తండ్రిపైనా ఫిర్యాదు చేసింది.

పద్మ తరఫున న్యాయవాది చేసిన ఫిర్యాదు

కోర్టు లోనే అయినప్పటికీ అది నిజమైన అర్థంలో 'సివిల్ కేసు' కాదు. న్యాయ సమస్యను పరిష్కరించుకోవటానికి చేసే రాజీ ప్రయత్నం ఇది. ఇలాంటి ఫిర్యాదులను మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు దాఖలు చేసుకోవచ్చు. ఇలాంటి ఫిర్యాదులను న్యాయసేవా సంస్థలో ఉండే సభ్యులు కలిసి విచారిస్తారు. వీరిలో ఒక న్యాయమూర్తి, ఒక న్యాయవాది, ఒక మహిళా లాయర్ ఉంటారు. ఈ ముగ్గురిని కలిపి 'లోక్ అదాలత్ బెంచి' అంటారు.

పద్మ దాఖలు చేసిన ఫిర్యాదును న్యాయమూర్తి పరిశీలించి అందులో పేర్కొన్న ప్రతివాదులకు నోటీసులు పంపించాలని ఆదేశించారు. న్యాయసేవా సంస్థ సిబ్బంది జడ్జి ఆదేశానుసారం పోస్టులో ప్రతివాదులకు నోటీసులు పంపించారు.

నోటీసులు అందుకున్న తర్వాత పద్మ అన్నలు ఇద్దరూ తమకు తెలిసిన న్యాయవాదులను సంప్రదించారు. నోటీసులతో పాటు వారికి అందిన ఫిర్యాదు కాపీని చూపించారు. *1985 నుంచి మన* రాష్ట్రంలో మహిళలకు తండ్రి ఆస్తిలో హక్కు కల్పించిన విషయాన్ని వారి న్యాయవాదులు తెలియపరిచారు. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు అడ్వకేట్లను కలిసినా వారికి పై విధంగా ఒకే రకమైన న్యాయ సలహా లభించింది.

నోటీసులో పేర్కొన్న తేదీ నాడు పద్మ సోదరులిద్దరూ లోక్‌అదాలత్ బెంచి ముందు హాజరయ్యారు. పద్మ తండ్రి కూడా హాజరయ్యారు. వారందర్నీ కూర్చోబెట్టి పద్మకు ఉమ్మడి ఆస్తిలో ఉండే హక్కు గురించి జడ్జి వివరించారు. తండ్రి ఆస్తిలో ఆడ కూతురుకు వాటా ఇవ్వడం అంటే పద్మ సోదరులకు మొదట్లో నచ్చలేదు. మరో వాయిదాలో న్యాయమూర్తి వారికి వివరించి చెప్పాక చెల్లెలికి వాటా ఇవ్వక తప్పలేదు. ఒకవేళ న్యాయసేవా సంస్థ ముందు ఈ సమస్య పరిష్కారం కానట్లయితే కోర్టుకు వెళ్ళకనైనా పద్మకు ఆస్తిలో వాటా వస్తుందని మిగతా లోక్ అదాలత్ సభ్యులు వివరించారు. ఏదో విధంగా కుటుంబ సమస్యను ఇక్కడే పరిష్కరించుకుంటే సరిపోతుందని పద్మ సోదరులు తగిన తీర్పు చెప్పమని లోక్‌అదాలత్‌ను కోరారు.

రాజయ్య ఇంటి విలువ, ఖాళీ ప్లాటు విలువ కలిపి ఆరు లక్షల రూపాయలు ఉంటుందని నిర్ణయించారు. అందులో పద్మ వాటా కింద రెండు లక్షలు ఇవ్వాలని లేదా ఆమె వాటాను మరొకరికి విక్రయించే హక్కు ఉంటుందని లోక్‌అదాలత్‌లో తీర్పు చెప్పారు. ఇరుపక్షాలు అంగీకరించగా తీర్పు చెబుతున్నామని ఇక దానిపై ఎవరికిగాని అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని న్యాయమూర్తి చెప్పారు.

రాజయ్య, న్యాయవాది చొరవ వల్ల ఎన్నాళ్ళో పడుతుందనుకున్న సమస్య కొద్ది రోజుల్లోనే పరిష్కారం కావటంతో తన లాయర్ ఫీజును రాజయ్య సంతోషంగా చెల్లించాడు.

ఈ తీర్పు వెలువడిన నెల రోజులకు రాజయ్య కుమారులు పద్మకు ఇవ్వవలసిన రెండు లక్షల రూపాయలు చెల్లించారు. ఆ డబ్బుతో పద్మ పెళ్ళి ఘనంగా జరిగింది. ☆

దశ తిరిగింది

(19వ పేజీ తరువాయి)

వాళ్ళకి సంభవించిన నష్టాలూ, అనర్థాలూ అన్నీ సోదాహరణంగా వివరించి చెపుతున్నాడు.

ఫలానా వెంకయ్య జలుబు చేసి తుమ్మడానికీ, ఫలానా సుబ్బయ్య వాళ్ళ ఇంట్లో పెంపుడు పిల్లి పిల్లో, కుక్క పిల్లో చచ్చిపోవడానికి కూడా వాళ్ళ ఇళ్ళకి వున్న వాస్తు దోషాలే కారణం అని కూడా చెపుతాడని నాకనిపించింది. అసలే మాటల పుట్ట! వాస్తు తెలిసినా, తెలియకపోయినా ఈశాన్యం, వాయవ్యం, ఆగ్నేయం, నైరుతీ మూలలు, అష్టదిక్పాలకులు, వేధ దోషాలు కొన్ని ఇలాంటి కఠినమైన మాటలు మాత్రం బాగా నేర్చుకున్నాడు. అన్నీ పడిగట్టు మాటలు!

క్రిష్టాచారి ఇలా మాట్లాడుతూ వుండగానే రాజన్న అనే అతను వచ్చాడు.

"ఏం రాజన్నా... ఏందీ ఎప్పుడూ రానోడివి ఇటుపడి వచ్చావు?" అడిగాడు క్రిష్టాచారి.

"మా పాటి చేలో బరిగొడ్ల కోసం రెండు నిట్టాళ్ళ కొట్టం యేస్తన్నమయ్యా! నువ్వు వచ్చి కొట్టానికి కొలతలు పెట్టి, ఏ మూల వెయ్యాలో చెబితే వేసుకుంటాం!"

"ఇప్పుడు నాకు చాలా పని వుంది కద రాజన్నా! పాలెంలో సుబ్బారెడ్డి వాళ్ళు బిల్డింగ్ కట్టుకుంటున్నారు. నన్ను వచ్చి చూడమన్నారు. పోవాల ఇప్పుడు!"

"ఎంతసేపుట్లో తిరిగొస్తా సామీ... మాకు వచ్చి చూసి చెబితే మేం కొట్టం యేసుకుంటాం!"

"నాకు అవతల అర్జంటుగా వెళ్ళాల్సిన పని వుందంటే, నువ్వు వచ్చి రా అంటే ఎట్ట? రెడ్డి వాళ్ళ ఇంటికి పోయి వాళ్ళు కట్టిచ్చుకోబోయే బిల్డింగ్‌కి ప్లాను వేసి పెడితే కోరినంత డబ్బు ఇస్తారు. నువ్వేమిస్తా చెప్పు?"

"నా శక్తి కొద్దీ ఇస్తాసామీ!"

"వాస్తు సరిగా లేకపోతే ఎంత కీడో చెప్పలేం! అష్ట దిక్పాలకులకి తండ్రిలాంటి వాస్తు! దిక్పాలకుల్లో ఏ పాలకుడికి అన్యాయం జరిగినా ఇక ఆ ఇంటి యజమానికి మూడినట్టే! ఇల్లుకానీ, కొట్టంకానీ ఏదయినా - పర్ణశాల నించి పార్లమెంటు దాకా, పూరింటి నించి పాతిక అంతస్తుల బిల్డింగ్ దాకా దేనికయినా వాస్తు వుండి తీరాలి! వాస్తు బాగుంటే ఇంట్లో సుఖశాంతులే కాదు, ధాన్యధనకనక వస్తు వాహనాలు అన్నీ సమకూరుతాయి. మనం పాటుపడాల్సిన పని లేదు. వాటి అంతట అవే దూకుతాయి! వాస్తు బాగులేకపోతే అన్నీ అనర్థాలే, అరిష్టాలే!"

వచ్చిన మనిషిని బెదరగొడుతూ అన్నాడు క్రిష్టాచారి. నిజానికి అవి అనవసరపు మాటలు!

"డబ్బు ఎంత ఇమ్మంటాసామీ?" అడిగాడు అతను.

"వాస్తు సిద్ధాంతి నోరు విప్పితే నూట పదహార్లకి తక్కువ తీసుకోడు. నువ్వు ఉండూరోడివి! నేను గట్టిగా అడిగేవాడ్ని కాదు. అర్ధనూట పదహార్లు ఇవ్వు!"

"ఇస్తా రాసామీ!"

"నువ్వు పద వస్తా!" అన్నాడు క్రిష్టాచారి.

"తొందరగా రాసామీ. అక్కడ పనోళ్ళు ఎదురు చూస్తా వుంటారు!" అంటూ రాజన్న వెళ్ళిపోయాడు.

క్రిష్టాచారి కదల్లేదు. ఉపన్యాసాన్ని ఆపలేదు. పిలిచిన వెంటనే వెళ్తే హోదాకీ, గౌరవానికీ భంగం కలుగుతుందనీ, తన కోసం వాళ్ళు 'ఎప్పుడొస్తాడా?' అని ఎదురు చూస్తూ వుండాలనే వుద్దేశంతో బాగా ఆలస్యం చేసి వెళ్ళాడు.

నిజానికి ఆ రోజు క్రిష్టాచారి ఎక్కడికీ వెళ్ళేది లేదు. అంతకు కొద్దిసేపు ముందు అతనే అన్నాడు ఎక్కడికీ వెళ్ళే పని లేదని.

కూలికి వెళ్ళి ఒక మగ మనిషి రోజంతా శ్రమ చేస్తే ఇస్తున్నది ఇరవై రూపాయలు! అలాంటిది అతను పది నిముషాల తన సమయానికి అర్ధనూట పదహార్లు అడిగాడంటే అది తక్కువ మొత్తం కాదు.

క్రిష్టాచారి మాటల్ని బట్టి డాబులూ, డాంబికాలూ, దబాయింపులూ, అబద్ధాలూ, అతిశయోక్తులూ బాగా మాట్లాడుతున్నాడనిపించింది.

కొద్దిసేపు కూర్చుని ఇంటికి వచ్చాను.

మా నాన్నకి ఆరోగ్యం అంత బాగులేకపోవడంతో నేను చదువుకి మంగళం పాడేసి పొలాలు చూసుకోవాల్సిన బాధ్యతల్లో పడిపోయాను.

శ్రావణమాసంలో క్రిష్టాచారికి వాళ్ళ అక్కయ్య కూతురితో పెళ్ళి జరిగిపోయింది.

నెమ్మదిగా అతని పేరు వాస్తు సిద్ధాంతిగా స్థిరపడిపోయింది.

అందరూ అతన్ని గౌరవంగా, గొప్పగా, భయభక్తులతో చూస్తున్నారు. ఒకప్పుడు చులకన చేసిన వాళ్ళు కూడా ఇప్పుడు అతనితో మర్యాద పూర్వకంగా, వినయ విధేయలతో వ్యవహరిస్తున్నారు.

పెళ్ళయిన మరుక్షణమే అతను వృత్తిపనిముట్లని కట్టకట్టి ముచ్చుమీదికి ఎక్కించాడు.

పంచాంగం ఒకటీ, వాస్తు గ్రంథం ఒకటీ చేత పట్టుకుని అవే తన భృతి ముట్లుగా మార్చుకున్నాడు. నుదుటి మీద బొట్టు మాత్రం చెక్కు చెదరకుండా ఎప్పుడూ వుండాల్సిందే!

★ ★ ★

కాలం తన పని తాను చేసుకుపోతూ వుంది. అది ఎవరికోసమూ ఆగదు కదా! ఆరేళ్ళు గడిచిపోయాయి.

క్రిష్టాచారి స్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ప్రజల్లో వాస్తు మౌఢ్యం ఎలా పెరిగిపోయిందో ఇప్పుడు అతని పేరు కూడా అలాగే పెరిగిపోయింది.

అతను గొప్ప సిద్ధాంతిగా పేరు పొందాడు. చుట్టు ప్రక్కల గ్రామాలనించే కాదు, ఒంగోలు, చీరాల పట్టణాల నించి కూడా అతని కోసం వస్తున్నారు. కొందరు కార్లు వేసుకుని వచ్చి అతన్ని తీసుకుపోతున్నారు.

అతన్ని సంప్రదించాలన్నా, సలహా తీసుకోవాలన్నా ఐదు వందల రూపాయలు సమర్పించుకోవలసిందే! కాలు కదిపితే వెయ్యినూట పదహార్లకి తక్కువ లేదు.

అతను బిల్డింగ్‌కి ప్లాన్ వేసి పెడితే, బిల్డింగ్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో 3 శాతం ఫీజుగా చెల్లించుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు. జనం కూడా సంశయించకుండా అందుకు పూర్తిగా సంసిద్ధపడుతున్నారు.

క్రిష్టాచారి పాత పెంకుటిల్లు కూలగొట్టేశాడు. గంగరావి చెట్టు నరికి వేశారు. ఆ స్థలంలో బిల్డింగ్ నిర్మించే ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

క్రిష్టాచారి లక్షణాలు - అవే - దబాయింపులూ, డాబులూ, డాంబికాలూ, అబద్ధాలూ, అతిశయోక్తులతో పాటు అతని కీర్తి ప్రతిష్టలూ, ఆస్తిపాస్తులూ మిక్కుటంగా పెరిగిపోవడం మొదలు పెట్టాయి. ☆

మొగమాచడం

కొండబాబు

సురేషూ, సుమలత హానీమూన్‌కి హైద్రాబాద్ వచ్చారు. సురేషు వాళ్ళ ఫాదరు వాళ్ళ ఊళ్ళో ఒకపాటి భూస్వామే కావడంతో డబ్బులు దండిగానే ఉన్నాయి.

ట్యాంక్‌బండ్‌కి దగ్గరలో ఓ హోటల్లో దిగారు. ఉదయం స్నానపానాలయ్యాక షెడ్యూలు ఖరారు చేసుకునేందుకు కొద్దిసేపు కూర్చుందామంది సుమలత. సురేషు కూర్చున్నాడు.

"ఉదయం గోల్కొండ ఫోర్ట్ చూద్దాం". అంది సుమలత.

"మధ్యాహ్నం సినిమాకెళదాం" అన్నాడు సురేష్.

"వద్దు.. మధ్యాహ్నం రెస్ట్ తీసుకొని సాయంత్రమంతా ట్యాంక్‌బండ్‌పై గడుపుదాం.. బోటుషైర్ చేద్దాం" అందామె.

"అయితే సెకండ్ షో సినిమాకెళదాం" అన్నాడు సురేష్ ఉల్లాసంగా.

"వద్దు... రూముకొద్దాం" అంది తను నవ్వుతూ.

"సరే రేపటి ప్రోగ్రాం ఏమిటంటే..." సురేష్ అందుకున్నాడు.

"చెప్పు" అందామె చిరునవ్వుతో...

"ఫస్ట్" నూన్‌షో చూద్దాం.... నెక్స్...!"

మధ్యలోనే కట్ చేసింది సుమ విసుగ్గా!

"ఏంటి..... హైద్రాబాద్ వచ్చింది సినిమాలు చూట్టానికా? మాట్లాడితే నూన్‌షో... మ్యాట్నీ అంటావు... సినిమాలంటే అంత మొగమాచిపోయావా?" అంటూ ఒక్క దులుపు దులిపింది మేనబావే అయిన తన భర్తను. "అదికాదు సుమా..."

"ఏది కాదు?.. వేరే ప్రదేశాలకు వస్తే అక్కడున్న చారిత్రక, ఆహ్లాదకర ప్రదేశాలు చూడాలి... నువ్వేంటి? సినిమాలో సినిమాలో అంటూ! సినిమాలు మన ఊళ్ళో లేవా?" అంటూ మళ్ళీ గట్టిగా ఇచ్చింది.

"అదికాదోయ్... ఇక్కడ ఇంగ్లీషు, హిందీ రిలీజ్ పిక్చర్స్ ఆడతాయని.." చెప్పబోయాడు సురేష్.

"మళ్ళీ సినిమా అంటే ఊర్కోను సరేనా?" కాస్త కోపం.. కాస్త నవ్వు కలగలిపి చెప్పింది.

"సరే...సరే..సరే...మేడమ్" అంటూ సురేష్ తన భార్య చేతులు పట్టేసుకున్నాడు నవ్వుల మధ్య.

సురేష్ లాంటి మనుషులు తారసపడటం చాలామంది అనుభవంలోని విషయమే. కొన్నింటి పట్ల అతి ఆసక్తిపరులై వాటి పట్ల వెర్రెత్తినట్లు, మొహమాచినట్లు వ్యవహరిస్తారు. అలాంటి వారికి సుమలత వంటివారే సరైన జవాబు చెప్పగలుగుతారు.

'టీ ఇప్పిస్తా రావోయ్... ఆ సంగతేంటో చెప్దువుగానీ అని అంటే 'టీకి మొహమాచిలేము లేవోయ్' అనడం కూడా వింటూంటాం. ట్రాన్స్‌ఫర్‌పై వచ్చి రోజూ, హోటల్లో తినే వ్యక్తి ఇంటి కూటికి మొహమాచి పోయానండి' అంటూంటాడు.

'మొహమాచడం' అనేది మన అచ్చ తెలుగు పదమే. మొహం (ముఖము) వాపు చేయడాన్నీ ఇలా అంటాము. దీనిపైనా అతిగా కోర్కె కలిగి ఉండటానికి మొహం వాయడానికి సంబంధమేమిటి? అనేది ప్రశ్న.

దీనికొక నేపథ్యం ఉంది. గర్భిణీ స్త్రీలకు ఒక దశలో మొహమూ, కాళ్ళూ వాపు చేస్తాయి. కాళ్ళు దుస్తులలో ఉండి కనిపించవు. మొహం మాత్రం వాపు చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. గర్భవతులకు అవీ ఇవీ తినాలనే కోర్కెలు ఎక్కువవుతాయని, అందువల్లే వారి మొహము (వళ్ళు కూడా) వాపు చేస్తుందని పూర్వం నుంచీ నమ్మేవారు. అందువల్ల రకరకాల వంటకాలు చేసి పెడితే ఆ వాపు తగ్గుతుందనుకునే వారు. మొత్తంగా చూసినపుడు దేనిపైనైనా అతిగా కోర్కె పుడితే మొహం వాస్తుందనే నమ్మకం ఏర్పడింది. అదే 'మొహమాచడం'గా అయింది.

వాస్తవం చెప్పాలంటే రక్తంలోని ప్లాస్మా అనే ద్రవపదార్థం గర్భవతులుగా ఉన్నప్పుడు క్షీరవాహక నాళాలలోకి ప్రవేశించడం వల్ల వళ్ళు, మొహము వాపు చేస్తాయి. అదీ అసలు మొహమాచడం సంగతి.

స్థిరపడిన సంగతేమో, అతిగా ఇష్టం ఏర్పడినపుడు మొహమాచడం జరుగుతుందని పూర్వం నుంచీ ఈ నమ్మిక. ఈ పదం వాడుక బలీయంగా ఉండేది. అందుకే మధ్యయుగ కవి తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మహాత్మంలోని ఒక పద్యంలో ఇలా పేర్కొన్నాడు.

"ఏరా తమ్ముడు, నన్ను చూడచనుదే వెన్నాళ్ళ నోయుండిచే

క్షూరా జీవయుగంబు వాచె నిను కన్గోకుని బావయు"

నిన్నమొన్నటి తిరుపతి వెంకటరావులు కూడా "చెవులును జవరాలి చిన్నది పొన్నారి ముద్దుపల్కులకునై మొగమువాచె" అని ఆసువుగా చెప్పారు. ఇంకా చెప్పుకుంటే ఈ పదం పట్ల మొగమాచామనుకుంటారు కాబట్టీ... అదే సంగతి. ☆

పాఠక స్పందన

పసందైన కచేరి

వారం వారం విభిన్న శీర్షికలతో ఆదివారం ప్రజాశక్తి అలరిస్తోంది. కచేరి శీర్షికన రుక్మిణి గారు వివరించే వ్యంగ్య ధోరణి చాలా బాగుంటోంది. ఈ వారం (21-10-2001) అనుబంధంలో ప్రచురితమైన 'కరువు బియ్యం - వరద వియ్యం' కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చేతకాని తనానికి అద్దం పట్టింది. కవర్ స్టోరీ 'సంబరాల దసరా' ఆద్యంతం సంబరంగా చదివించింది.

- **బట్టా రామకృష్ణ**, సౌత్‌మోపూర్ గ్రామం,నెల్లూరుజిల్లా,

- **డా॥ ఎస్.సి.రావు**, మల్లంపేట, విజయనగరం జిల్లా

మంచి వ్యాసం

21 అక్టోబర్ 2001 ప్రజాశక్తి ఆదివారం సంచికలో క్రీడారంగం శీర్షికన ప్రచురించిన 'విలక్షణ క్రికెటర్లకు నెలవు హైదరాబాద్' గురించి చాలా చక్కగా తెలియజేశారు. భారత క్రికెట్ తరఫున హైదరాబాద్ ఆటగాళ్ళు ఇప్పటివరకు అందించిన సేవలు గురించి చాలా బాగా తెలియజేశారు.

- **పుట్టా శ్రీనివాసరావు**, లక్కవరపుకోట, విజయనగరం జిల్లా

తర్జన భర్జన బాగుంది

21వ తేదీ ఆదివారం అనుబంధంలో పలుకుబడి శీర్షికన ప్రచురించిన 'తర్జన భర్జన' మమ్మల్ని ఎంతో ఆనందపరిచింది.

- **ఎస్.శ్రీదేవి, కె.రేవతి దేవి**, మల్లంపేట, విజయనగరం జిల్లా

మూగభాష బాగుంది

14వ తేదీ సంచికలో ప్రచురించిన మూగభాష కవిత బాగుంది. బాల కథలోని 'పుస్తకం విలువ' చాలా నచ్చింది. బాల నేస్తాల్లో 'పొటాటోతో జిరాఫీ' బాగుంది.

- **పి.ఎస్.ఎస్.కిరణ్**, రామచంద్రాపురం, తూర్పుగోదావరిజిల్లా

ఆలోచింప చేసిన కులవివక్షపై వ్యాసం

అక్టోబర్ 14 ఆదివారం అనుబంధంలో 'దళితులపై వివక్షకు అంతం ఎన్నడు?' వ్యాసం, అందులో జస్టిస్ పున్నయ్యగారి ఇంటర్వ్యూ, మిగిలిన వారి అభిప్రాయాలు చాలా ఆలోచింప చేసేవిగా వున్నాయి.

- **టి.శ్రీరామ్మూర్తి**, గాజువాక, విశాఖపట్నం

కార్మిక, కర్షక దినపత్రిక సామాన్యుల ప్రియ పత్రిక

ప్రజాశక్తి
దినపత్రిక

HAYWARDS

5000

THE ORIGINAL

DARTING KIT